కుక్కకాటును నిర్లక్ష్యం చేసి..

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 15 : కుక్కకాటును నిర్లక్ష్యం చేయడంతో ఒక మహిళ మృతిచెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన ఉస్సే ప్రియాంక (29) జనవరిలో కుక్క కాటుకు గురైంది. చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేసింది. అయితే గత 4 రోజులుగా ఆమెలో రేబిస్ లక్షణాలు కనిపించడంతో ఆమెను కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యుడి సూచన మేరకు శనివారం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది.



ఐదేళ్ల తరువాత ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

వచ్చే నెల 4న నోటిఫికేషన్ - 20న పోలింగ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మకమైన ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలను ఎట్టకేలకు జరగనున్నాయి.చివరగా 2013లో ఎన్నికల జరిగాయి. 2018లో తిరిగి జరగాల్సి ఉండగా 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా తమ నాయకులనే పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించి బ్యాంక్‌ను దోచుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలు జరగకుండా అడ్డుకుంది. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించింది. ఒక పక్క కోర్టు ధిక్కార కేసు కోర్టులో నడుస్తుండగా, మరొక పక్క అధికారులతో ఏర్పడిన త్రిసభ్య కమిటీ ఎన్నికలకు సిఫార్సు చేయడంతో ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. జూలై 4న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే నెల 11 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 20వ తేదీన పోలింగ్ జరుగుతుంది.కూటమి నేతలు సరిగ్గా దృష్టిపెడితే పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ఇతర పార్టీలెవరైనా పోటీకి సై అంటే ఎన్నికలు జరుగుతాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఆర్యాపురం బ్యాంక్ సుమారు రూ.1080 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడే కాకుండా ఇతర జిల్లాలో కూడా బ్యాంక్ బ్రాంచిలు ఉన్నాయి. మొత్తం 16 బ్రాంచ్‌లు నడుస్తున్నాయి.రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచి, కాతేరు, తిలక్‌రోడ్‌లోని స్వరాజ్యనగర్, కోటగుమ్మం, బొమ్మూరు, దానవాయిపేట, దివాన్‌చెరువు, జెఎన్‌రోడ్డులలో బ్రాంచిలు ఇక్కడ ఉండగా గుంటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, విశాఖ, తణుకు, అమలాపురం, కాకినాడలలో ఒక్కో బ్రాంచి ఉన్నాయి. బ్యాంక్ పరిధిలో మొత్తం 95,096 మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఓటు హక్కుకు అర్హత పొందిన వారు 79,531 మంది ఉన్నారు. రూ.300 కంటే షేర్ ధనం ఉండి సక్రమంగా లావాదేవీలు నిర్వహించని 15,565 మంది ఓటు హక్కు కోల్పోయారు. అర్హత పొందిన వారిలో కూడా ఓవర్ డ్యూస్ ఉంటే ఓటు కోల్పోతారు. జూలై 4వ తేదీలోపే బకాయిలు క్లియర్ అయితే వారికి ఓటు హక్కు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.

4న నోటిఫికేషన్

ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 4న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.ఈ నెల 17న అన్ని బ్రాంచిలలో తాత్కాలిక ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 24వ తేదీ వరకూ ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27న బ్యాంక్ సీఈవో తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 4న నోటిఫికేషన్ జారీ చేస్తారు.11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు.అదే రోజు నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు పరిశీలిస్తారు. 13న 5 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు.20న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. 21న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

పిల్లల గుర్తింపు బహిర్గతం చేయవద్దు : జడ్జి

రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ యాక్ట్-2015పై పోలీసు,చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు స్పష్టమైన అవగాహన అవసరమని జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులకు జువైనల్ జస్టిస్(కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్-2015పై శనివారం అవగాహన కల్పించారు. పిల్లల గుర్తింపును ఎట్టి పరిస్థితుల్లోనూ బహిర్గతం చేయరాదన్నారు.చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టానికి జవాబుదారులవుతారని స్పష్టం చేశారు. చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండర్ ప్రొటెక్షన్ యాక్ట్-2015పై డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు వివరించారు. కార్యక్రమంలో 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీ బాషా, 3వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సి.రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఈదురుగాలుకు నేలవాలిన వృక్షాలు

సీతానగరంలో ఈదురుగాలులు

సీతానగరం, జూన్ 15 : ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలులు మండలంపై విరుచుకుపడ్డాయి. దీంతో ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. మండలంలో శనివారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. 10 నిమిషాల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పచ్చని చెట్లు నేలకొరిగాయి.చినకొండేపూడి నుంచి పెదకొండేపూడి వెళ్లే దారిలో, చినకొండేపూడి నుంచి చీపురుపల్లి వెళ్ళే దారిలోను చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చీపురుపల్లి రోడ్డులో చెట్లు విద్యుత్ స్థంభాలపై పడడంతో వైర్లు తెగి రోడ్డుపైనా పడిపోయియి దీం తో చినకొండేపూడి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక్కసారిగా వచ్చిన వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చస్తూ..బతకలేక!

ఎలా ఉన్నారని పలకరించేవారు లేరు.. తిన్నారా అని అడిగేవారు లేరు.. తల్లీతండ్రీ మృతితో ఒంటరివారిగా మారిన ఇద్దరు సోదరులు.. అన్నీ ఉన్నా ఏమీలేనివారిగా మారిపోయారు.. నడిపించే నాన్న.. తోడుగా ఉండే అమ్మ దూరమవడంతో కుంగిపోయారు.. చాలా కాలంగా బంధువులను తమ దగ్గరకు రానీయకుండా ఒంటరిగా బతుకుతున్నారు.. ఒకరు ఎంబీఏ.. మరొకరు ఎంసీఏ చదివినా.. లోకంలో నెగ్గుకురాలేక.. చస్తూ బతకలేక చివరకు ఆత్మహత్య చేసుకున్నారు.. ఈ విషాదఘటన రాజమహేంద్రవరంలో శనివారం జరిగింది.. - వివరాలు 5లో

డీఎస్పీకి ఆ ధైర్యం ఎక్కడిదో..

ఓట్ల కౌంటింగ్‌కు సరిగ్గా రెండు రోజుల ముందు ఓ డీఎస్పీపై వేటు పడింది.అతని అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు స్పందించి ఆ రోజు సాయంత్రానికి సాగనంపేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అయితే మళ్లీ వైసీపీ రావడం ఖాయమని 5న వచ్చి(4న కౌంటింగ్ జరిగిన విషయం తెలిసిందే) తిరిగి జాయినవుతానని ధీమాగా చెప్పారంటే అవినీతి అధికారులకు వైసీపీ ఏ స్థాయిలో కొమ్ముకాసేదో అర్థం చేసుకోవచ్చు.

ఎవరినీ వదలం : గోరంట్ల

వీఆర్‌వోల నుంచి తహశీల్దార్.. కలెక్టరేట్ వరకూ రెవెన్యూ అధికారులు చేసిన అవినీతి, అన్యాయాలపై విచారణ జరిపిస్తాం... వైసీపీ నేతలతో కుమ్మక్కయి తప్పులు చేసిన అధికారుల భరతం పడతాం.. రాష్ట్రంలో జగన్ మొదలు అవినీతికి పాల్పడిన వారందరినీ చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో రెవెన్యూ అధికారులు అనేక మంది ఎకరాల కొలదీ భూములను అన్యాక్రాంతం చేశారు. అవన్నీ బయటకు రప్పించి చట్టప్రకారం దోషులపై చర్యలు తీసుకుంటాం. సీనియర్ ఎమ్మెల్యేనైన నాకు కూడా ప్రొటోకాల్ పాటించకుండా ఇబ్బందులు పెట్టారు. ఇదీ శుక్రవారం జిల్లాలోని అధికారులకు ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి హెచ్చరిక..

నాడు.. నేడు చూడకుండా చేసి..

ఈ రెండు ఘటనలు వైసీపీ ప్రభుత్వంలో అధికారుల తీరు తెన్నులు బయటపెడతాయి.. ఆరోపణలతో విధుల నుంచి తొలగించిన ఒక డీఎస్పీ స్థాయి అధికారి..కౌంటింగ్ పూర్తయిన తరువాత విధుల్లో చేరిపోతానన్నాడంటే ఏమి ధైర్యమో అర్థం చేసుకోవచ్చు. ఇక సీనియర్ ఎమ్మెల్యే.. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు చేసిన హెచ్చరిక చూసినా నిజమే కదా అనిపించక మానదు.. ప్రభుత్వం మారడంతో అటువంటి అధికారులకు దడ పట్టుకుంది.. ఏ క్షణాన ఏమి తమ మెడకు చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు..



అధికారుల్లో.. దడ..దడ

భయంతో వణుకుతున్న అవినీతి అధికారులు

- నాడు వైసీపీ పాలకులు చెప్పిందే వేదం
- ఫిర్యాదు చేసినా కేసుల్లేవ్.. అరెస్టుల్లేవ్
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ప్రతిపక్ష నేతల వినతులపై చిన్నచూపు
- అక్రమాలతో అంటకాగిన అధికారులు
- భయంభయంగా బతుకు
- ఎవరినీ వదిలేది లేదన్న గోరంట్ల
- విచారణ తప్పదన్న సంకేతాలు
- నేడు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐపీసీని పక్కన పెట్టేశారు. వైసీపీ అక్రమాలతో అంటకాగారు. ఆ నాయకులు చెప్పిందే తడవుగా రంగంలోకి దూకారు. నిబంధనలను 'గాలి'వాటం చేశారు. చట్టాలను అతిక్రమించి 'అంతకుమించి' వ్యవహారాలు నడిపించారు. ప్రతిపక్షాలపై ప్రతాపం వెలగబెట్టారు. అన్యాయాన్ని కొత్త పుంతలు తొక్కించారు. ప్రకృతి వనరులను మింగేస్తున్నా కరెన్సీతో కళ్లు మూసుకున్నారు. బాధితులకు నరకం చూపించారు. పాపం ఊరికే పోదుగా.. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన సంచలనమైన తీర్పుతో వైసీపీ అరాచకాలతో అంటకాగిన అధికారుల వెన్నులో వణుకుపుడుతోంది. తలా పాపం తిలా పిడికెడు అన్నట్టుగా ఆ అధికారులను వెనకేసుకొచ్చిన ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్, విద్య, వైద్యం, పోలీస్, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, సెబ్, ఆర్టీఏ.. ఇలా కీలకమైన విభాగాల్లోని కొం దరు అధికారులకు వైసీపీ నాయకుల అరాచక ఆదేశాలు మాత్రమే వినిపించాయి. ఉద్యోగ బాధ్యతలను వైసీపీలో కలిపేశారు. 'వైసీపీ రాజ్యం, జగన్ రాజు' అన్న చందంగా అడ్డూ అదుపూ లేకుండా రెచ్చిపోయారు.వైసీపీ నాయకుల దగ్గర నుంచి ఫోన్ వస్తే 'ఆ సైడే' పని జరిగిపోయేది. బాధితుల రోదన మౌన వేదన అయ్యేది. ఇప్పుడు 'వారి వంతు' వచ్చింది. ఏ క్షణం విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందో.. ఏ రోజు జైలుకు వెళ్లాల్సి వస్తుందో అని వణికిపోతున్నారు.కొందరు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉండగా..బదిలీ పేరుతో వేరే ప్రాంతానికి పారిపోయే తంత్రాన్ని మరికొం దరు ప్రయోగిస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే నిజాన్ని గుర్తుచేస్తూ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అక్రమాలకు కేరాఫ్‌గా.. రెవెన్యూ

వైసీపీలోని భూ అక్రమార్కులకు, కబ్జాదారులకు మేలు చేయడానికి ఫైళ్లను, వాటిలోని కాగితాలను ఇష్టా నుసారం తికమక చేశారనే ఆరోపణలున్నాయి. కంప్యూ టర్‌లో సైతం డేటాను వక్రీకరించారని తెలుస్తోంది. ఏ పని చేయాలన్నా రెవెన్యూ శాఖ వేలు కచ్చితంగా ఉంటుంది. ఈ క్రమంలో జిల్లా స్థాయి కార్యాలయంపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వైసీపీ నాయకుల సిఫారసు ఉండి చేతిలో డబ్బు పడితే కావాల్సిన సీటుకు పోస్టింగ్ వచ్చేదని చెబుతున్నారు.

ఇసుకలో మునిగేదెవరో..

ఏ రోడ్డు చూసినా భారీ ఇసుక లారీలు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచీ ఒక్క లారీ రోడ్డుపై కన బడడం లేదు.ఈ ఐదేళ్లు ఇసుకాసురులు గోదావరికి తీవ్ర గర్భశోకాన్ని కలిగిస్తుంటే ఎక్కడో ఢిల్లీలో ఉన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కి కనిపించింది. కానీ అక్రమానికి పక్కనే ఉన్న అధికారులు మాత్రం తమకేమీ కనబడడం లేదంటూ నటనను రక్తి కట్టించేవాళ్లు.ఒకటి కాదు, రెండు కాదు వందల లారీల్లో ఇసుక, మట్టి అక్రమంగా తవ్వుకుపోతున్నా ఎవరికి చెప్పాలో తెలియని దుస్థితిని ప్రజలు చూశారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే వాళ్లకు వైసీపీ నాయకులు బెదిరింపులు,అధికారుల అదిలింపులు తప్పేవికావు. ఇసుక అక్రమం పరాకాష్టకు చేరి గామన్ బ్రిడ్జి పీకలపైకి వచ్చింది. 57,58 పిల్లర్ల వద్ద బేరింగ్ పాడై కుంగి పోయింది. వైసీపీ నాయకులు, కొందరు అధికా రుల కలయికతో బ్రిడ్జికి ఆ దుస్థితి వచ్చింది. బ్రిడ్జిల స్పాన్ల (పిల్లర్లు)కు 500 మీటర్ల వరకూ ఇసుక తవ్వకాలు జరపకూడదనే కచ్చితమైన నిబంధనలు ఉన్నా ఇసుక తవ్వకాలు భారీ యంత్రాలతో రేయింబవళ్లు జరుగుతుం డేవి. ఈ తతంగం ప్రజలకు కనిపించినా, అధికారులకు కనిపించేది కాదు.రోడ్ కం రైలు బ్రిడ్జికి సమీపంలో ఇసు క తవ్వేస్తున్నారని సాక్షాత్తూ రైల్వే పోలీసులు జిల్లా ఉన్న తాధికారులకు నివేదిక ఇచ్చినా ఫలితం శూన్యం. ప్రతి రోజూ గోదావరిలో విపరీతంగా డ్రెడ్జింగ్ జరుగుతు న్నా.. కలెక్టర్ వెళ్లేసరికి అంతా గప్‌చుప్. ఆమె రీచ్‌కి వస్తున్నారని మరి ఎలా సమాచారం వెళ్లేదో ఇసుకకే తెలియాలి.

తరలిపోతుంటే వీళ్లేం చేశారో?

సెబ్, మైనింగ్ అధికారుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.ప్రకృతి వనరులు ముఖ్యంగా మట్టి, ఇసుక అక్రమంగా తరలిపోకుండా కాపాడే ప్రథమ బాధ్యత వారిపై ఉంది.కానీ కొందరు అధికారులు వైసీపీ నాయకులకు దాసోహమై అవినీతి సొమ్ముల కోసం చూసీ చూడనట్టు వదిలేశారు. ఫలితంగా వేల కోట్ల రూపాయల ప్రకృతి వనరులు వైసీపీ నాయకుల జేబు ల్లోకి వెళ్లిపోయాయి.ఈ పాపంలో రెవెన్యూ,పోలీస్ అధికారులు కొందరు తమదైన పాత్ర పోషించారు.రాజానగరం నియోజకవర్గం లో వైసీపీ నాయకులు ప్రకృతి వనరులను మింగేస్తుంటే.. కొండలను నేలమట్టం, చెరు వులను అగాథాలుగా చేస్తుంటే మైనింగ్, సెబ్,పోలీస్, రెవెన్యూ శాఖల్లోని కొందరు అధికా రులు ఇతోధికంగా సహాయపడ్డారు.అక్కడా 'రాజా'వారు చెప్పిందే వేదంగా పలువురు అధికారులు 'పని' చేసి పెట్టేవాళ్లు.

సెటిల్‌మెంట్..తహశీల్దార్?

నిడదవోలులో గతంలో తహశీల్దారుగా చేసి ప్రస్తుతం రుడాలో ఉన్నతస్థాయిలో ఉన్న ఓ అధికారి అక్కడ పని చేసే సమయంలో వైసీపీ ఎమ్మెల్యే అండతో భూ సెటిల్ మెంట్లలో తీవ్రంగా అలసిపోయేవారు. ఆ ఎమ్మెల్యే చెప్పినట్టు చేసి.. పనికి తగిన మూల్యం పొందే వారు.గోపవరం గ్రామంలో పేదలకు ఉద్దేశించి ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లో నిబంధనల ప్రకారం కమ్యూనిటీ పర్పస్‌కి వదిలేసిన భూమిలో కూడా స్థలాలు అమ్ముకున్నారు. రోడ్డు పక్కన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వదల్లేదు. డబ్బులు పుచ్చుకొని ప్లాట్లు ఇచ్చేశారు.

ఆ డీఎస్పీ సంగతేంటో!

పోలీస్ డిపార్టుమెంట్లో వైసీపీకి అడ్డంగా కొమ్ముకాసినట్లు ఆరోపణలున్న ఓ డీఎస్పీ.. పైకి సౌమ్యుడిగా కనిపిస్తూ తనదైన పంథాలో వైసీపీ నాయకులకు ఏకపక్షంగా 'పనులు' చేసి పెట్టడంపై తీవ్ర ఆరోపణలున్నాయి. ఎన్నికలకు ముందే ఆ అధికారిపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు కూడా చేశారు. తాజా మాజీ ఎంపీ భరత్‌రామ్ తమకు రాష్ట్రాన్ని రాసిచ్చేసినట్టు వ్యవహరించేవారు. ఆయన ఏది చెబితే అది కొందరు అధికారులు కళ్లు మూసుకొని 'మామూలు'గా కానిచ్చేసేవాళ్లు. అక్రమాలకు ఎవరైనా ఎదురు చెబితే వేధింపులు తప్పేవికావు. ఓ టీడీపీ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని, మరో టీడీపీ నాయకుడిపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీఐలను ఆదేశిస్తే..వారు నిబంధనలకు విరుద్ధమంటూ సమాధానమిచ్చారు.వాళ్లను వీఆర్‌కి సాగనం పారు. ఉన్నతాధికారులు ఈ అక్రమాన్ని అడ్డుకోలేకపోయారు.

ఆ ముగ్గురిపై..ఆరోపణలు..

రాజమహేంద్రవరంలో ఓ విచిత్రమైన పరిస్థితిని జనం చూశారు. ఐదేళ్లు 'గాలి'కి వదిలేసి.. సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు విచ్చలవిడిగా మునిసిపాలిటీ సాధారణ నిధులతో అభివృద్ధి అంటూ విధ్వంసం సృష్టించారు. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ నాయకులు ఫలానా పని చేయాలని ఆదేశిస్తే ఇంకేముంది తమకూ కొంత పంట పండుతుందనే ఆశతో జనం సొమ్మును మంచినీళ్లలా ఖర్చు పెట్టేశారు.నాణ్యతను పట్టించుకోకుండా ఇష్టానుసారం రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలంటూ కోట్లాది రూపాయలు పోశారు. పార్కుల అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున అవినీతి జరిగిం దనే ఆరోపణలున్నాయి.ఒక వైసీపీ నేత అనుయాయులే కాంట్రాక్టర్లుగా వ్యవహరించడంతో నాణ్యతకు తిలోదకాలిచ్చేశారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన హోదాల్లో ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌పై టీడీపీ నేతలు పలుమార్లు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. వైసీపీ నాయకులు కలెక్టర్ ద్వారా జేసీ, కమిషనర్‌తో పనులు చక్కబెట్టుకునేవారనే విమర్శలున్నాయి. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గతంలోనూ తాజాగా తీవ్రంగా ఆగ్రహించారు.కనీసం ప్రొటోకాల్ కూడా పాటించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు చేశారు.

ఐపీసీని పక్కన పెట్టేసిన వైసీపీ..

ఎవరికైనా రక్షణ అవసరమైన సమయంలో గుడి కంటే ముందుగా పోలీస్ స్టేషన్‌కు వెళతాం. అయితే వైసీపీ ప్రభుత్వంలో కొన్ని పోలీస్ స్టేషన్లు వైసీపీ నాయకుల సెటిల్‌మెంటు కేంద్రాలుగా మారిపోయాయి. వైసీపీ నాయకులు నేరుగా పోలీస్ స్టేషన్‌లోనే దందాలు చేసి అక్రమ సొమ్మును తలాకొంత సర్దుకునేవాళ్లు. వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఎవరు వెళ్లినా కొందరు పోలీసుల్లో పెద్దగా స్పందన కనిపించేదికాదు. పైగా ఫిర్యాదులో ఉన్న వైసీపీ నాయకుడికి సమాచారం వెళ్లిపో యేది. వాళ్ల పోలీస్ స్టేషన్‌కి రాకపోగా.. బాధితుడు మరింత బాధపడాల్సి వచ్చేది. వైసీపీ వాళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే ఓ పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చేది.లారీతో గుద్దించి చంపేస్తానంటూ ఓ రాజస్థానీ మహిళను ఓ వైసీపీ నాయకుడు ఫోనులో బెదిరించినా చర్యల్లేవు.ఓ యువ లాయర్‌ని అర్ధరాత్రి వేళ చితక్కొట్టి తర్వాత కాళ్లు పట్టుకున్నంత పని చేసి నాలుగో సింహం పరువు తీశారు. ఎమ్మెల్యే విజేత బుచ్చయ్యచౌదరి పీఏని బహిరంగంగా వైర్‌లెస్ సెట్‌తో రక్తం కారేలా కొట్టినా లైట్ తీసుకున్నారు.ఓ దళితుడికి పోలీస్ స్టేషన్లో శిరోముండనం చూసి చట్టం రోదించింది. న్యాయం కోరితే నా భర్త గుండు కొట్టేశాడని ఆశ్రయించిన వివాహి తను వైసీపీ నాయకుల అండ చూసుకుని ముప్పు తిప్పలు పెట్టారు.భారీ యంత్రాలతో ఇసుకను దోపిడీ చేస్తున్నా మామూళ్ల మత్తులో మునిగిపో యారు. సామాన్యుడి స్థలాలను వైసీపీ కబ్జాదారులు చెరబడుతున్నా కిక్కురుమనలేదు.చంద్రబాబును అక్రమంగా జైలులో ఉంచినపుడు టీడీపీ అభిమానులను సాధ్యమైనంత వేదనకు గురిచేశారు. సీఆర్పీసీ సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు చేశారు. వైసీపీ నాయకులకు మాత్రం అనధికారిక మినహాయింపునిచ్చారు. రోడ్డుపై వేడుకలు చేసు కున్నా లాఠీ విదిలించలేకపోయారు.

ఉల్లి..లొల్లి!

అదే దారిలో కూరగాయల ధరలు



- నెల రోజులుగా ఘాటెక్కుతున్న ఉల్లి
- కిలోకు రూ.15 వరకూ పెరుగుదల
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.45
- రైతు బజార్‌లో కిలో రూ. 32
- టమాటా కిలో రూ. 60
- ఇష్టారాజ్యంగా వ్యాపారుల అమ్మకాలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15 : ఒక పక్క ఉల్లిపాయలు.. మరోపక్క కూరగాయలు.. సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉల్లిపాయల ధరలు కన్నీళ్లు తెప్పించేలా పెరుగుతుండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల ధరలు చాపకింద నీరులా రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మంచి నాణ్యత కలిగిన ఉల్లిపాయలు రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.30ల వరకూ ధర పలుకుతున్నాయి. రిటైల్ వ్యాపారులు వీటిని రూ.40 నుంచి రూ.45ల వరకూ విక్రయిస్తుండడం గమనార్హం.రాజమహేంద్రవరం రైతు బజార్లలో క్వాలిటీ అంతంతమాత్రంగా ఉండే చిన్న ఉల్లిపాయలనే కిలో రూ.32లకు విక్రయిస్తున్నారంటే ఉల్లి ధరల పెరుగుదల ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లన్నీ మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే ఆధారడి ఉంటాయి. బళ్లారి, కర్నూలు పాయలు మార్కెట్లోకి వచ్చినా అవి సీజన్‌లో మాత్రమే కనిపిస్తాయి. దీంతో మహారాష్ట్ర ఉల్లిపాయలు ఏడాది పొడవునా లభించడంతో వీటిపైనే మార్కెట్లన్నీ ఆధారడి ఉంటాయి. మహారాష్ట్ర పాయలు పెద్దవిగా ఉండడంతో హోటళ్లు, ఫంక్షన్లకు వీటినే ఎక్కువగా వాడుతుంటారు. దీంతో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లకు ఉల్లిలోడులు రావడం బాగా తగ్గింది. ఇటీవల కాలంలో రాజమహేంద్రవరం చుట్టుపక్కల హోల్‌సేల్ మార్కెట్లు కొత్తగా వెలిశాయని, కొత్తవ్యాపారులు మహారాష్ట్ర నుంచి నేరుగా సరుకు రప్పించుకుంటున్నారని, దీంతో లోకల్ మార్కెట్‌కు సరుకు కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. కొత్త ఉల్లిపాయలు రావాలని లేకపోతే గొడౌన్లలో దాచిన ఉల్లిపాయలు బయటకు తేవాలని, అప్పుడు కానీ ధరలు తగ్గే అవకాశం లేదని చెబుతున్నారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి రూ.100లకు ఐదు కిలోలు,ఆరు కిలోలు అంటూ మైకులతో హోరెత్తించే ఆటోలు ఇప్పుడు వీధుల్లో ఎక్కడా కనిపించడంలేదు.

కూరగాయల పరిస్థితి ఇంతే..



ఉల్లిపాయల ధరలతో పాటు కూరగాయలు కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్టు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకూ పచ్చిమిర్చి ఘాటెక్కిస్తే ఇప్పుడు టమాటా వంతు వచ్చింది. బహిరంగ రిటైల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.60లపైనే ధర ఉంది. టమాటా మన ప్రాంతంలో ఎక్కడా సాగు చేయడం లేదు. ప్రస్తుతం ఇక్కడి వ్యాపారులంతా చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచే దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధర భారీగానే పెరిగింది. కొద్ది రోజుల కిందట కిలో రూ.80-90ల వరకూ వెళ్లిన పచ్చిమిర్చి ఇప్పుడు రూ.60కి తగ్గింది. బహిరంగ రిటైల్ మార్కెట్‌లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.60 వరకూ అమ్ముతుంటే, బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.60, బీరకాయలు రూ.70, చిక్కుళ్లు రూ.100ల వరకూ విక్రయిస్తున్నారు. రైతుబజార్లలోనూ ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నాయి. దొమ్మేరు వంకాయలు కిలో రూ.40, గులాబీ రకం రూ.28, తెలుపు రూ.28ఉంది.బెండకాయలు రూ.36, పచ్చిమిర్చి రూ.46, కాకరకాయ రూ.36, చిక్కుళ్లు రూ.76, చేమదుంపలు రూ.44, బీన్స్ గింజలు రూ.130, ఆనబకాయ రూ.25.. ఇలా కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది.

వాతావరణ పరిస్థితుల ప్రభావం..

ఉల్లిపాయలు, కూరగాయల ధరల హెచ్చుతగ్గుల విషయంలో వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుత ఎండలతో కూరగాయల పంటలకు పెద్ద నష్టం లేకపోయినా భారీ వర్షాలు పడితే మాత్రం నష్టం తప్పదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. వర్షాలు ఎక్కువగా పడితే బీర, దొండ, ఆనబ, పొట్ల, కాకరకాయ, చిక్కుళ్ల వంటి పాదులు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది.వంకాయలు, బెండకాయ తోటలకు ఇబ్బందిలేకపోయినా పూతరాలిపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. ఇలా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైతే ధరలు దిగివచ్చే అవకాశం ఉండదు. సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం మరి కొన్నాళ్లపాటు ధరల భారాన్ని మోయక తప్పదనే అభిప్రాయం వ్యాపార వర్గాల నుంచి వినిపిస్తోంది.



ఇసుకాసురులను వదిలేసి..

డ్రైవర్లపై కేసులా?

కొవ్వూరు, జూన్ 15 : ప్రభుత్వం మారినా ఇసుకాసురులు మాత్రం ఆగడం లేదు. ఏదో విధంగా దోచుకునేందుకు తెగబడుతున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 లారీలు, బుల్ ఎక్సవేటర్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. కొవ్వూరు వాడపల్లి రోడ్‌లోని ఎరినమ్మఘాట్ ఇసుక ర్యాంపు నుంచి మండలంలోని వేములూరు గ్రామంలోని వెంకటేశ్వరనగర్ లేఅవుట్‌లోకి ఇసుక తరలించి అక్రమంగా ఇసుక డంపింగ్ చేస్తున్నారు. అనధికారికంగా ఇసుక నిల్వచేసి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీచేశారు. దీనిలో భాగంగా ఇసుక తరలిస్తున్న 2 లారీలు, 126 క్యూబిక్ మీటర్ల ఇసుక, ఇసుక లోడ్‌చేసే ట్రాక్టర్ బుల్, 210 నంబరు ఎక్సవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు డ్రైవర్లపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సమయంలో కూడా లారీ డ్రైవర్లపైనే కేసు నమోదు చేసి ఇసుకాసురులను వదిలేశారు.ఈ సారి అదే విధంగా డ్రైవర్లపై కేసు నమోదు చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు దోషులను పట్టుకుని అరెస్టు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

కొమ్మనాపల్లిలో కొత్తగా మరో 28 డయేరియా కేసులు


తొండంగి: బాధితుడిని పరామర్శిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరి

తొండంగి, జూన్ 15: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లిలో డయేరియా ఉధృతి కొనసాగుతోంది. వరుసగా మూడో రోజైన శనివారం కొత్తగా 28 కేసులు నమోదయ్యాయి. వీరిలో 16 మందిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, స్థానికంగా 12 మందికి సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి చికిత్స అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియా లక్షణాలతో వచ్చిన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స అందించి తక్షణం కాకినాడ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుకు తరలిస్తున్నారు. దీని నిమిత్తం వైద్య శిబిరం వద్ద మూడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అదనపు వైద్యులను వైద్య సిబ్బందిని నియమించారు. ఆశ వర్కర్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామంలో 224 గృహాలను సందర్శించి సర్వే నిర్వహించారు. కాకినాడలో సుమారు 25 మంది వరకూ చికిత్స పొందుతున్నారు. కొందరు వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. వివిధ గ్రామాల సచివాలయ సిబ్బందిని రప్పించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్లు, జేసీబీలను ఉపయోగించి కాల్వల్లో పూడిక తొలగించారు. వీధివీధికి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

గ్రామాన్ని సందర్శించిన వైద్యఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్

వైద్యఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాయక్‌తో కలిసి శనివారం గ్రామంలో పర్యటించారు. డయేరియా బాధిత కుటుంబాలు ఉన్న వీధికి తాగునీటిని సరఫరా చేసే ట్యాంకు వద్దకు వెళ్లి పరిశీలించారు. సమీపంలో పెంట గొయ్యి, అపరిశుభ్ర వాతావరణం ఉండడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గోతికి ,బోరుకు మధ్య ఉన్న దూరాన్ని కొలిపించగా 20 మీటర్ల లోపు ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కనీసం 30 మీటర్ల దూరం ఉండాలన్నారు. గోతిని పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ మార్గాన్ని పరిశీలించారు. బాధితులు ఉన్న ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం ఆమె వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి అందిస్తున్న చికిత్సపై ఆరా తీశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఎంపీడీవో మార్కండేయులు, గ్రామ సర్పంచ్ అమ్మాజీ సూర్యనారాయణ తదితరులు అధికారుల వెంట ఉన్నారు.

జీజీహెచ్‌లో పలువురికి చికిత్స

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 15 తొండంగి మండలం కొమ్మనాపల్లి డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం నాటికి 24 మందికి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సను అందిస్తుండగా మరో 20 మంది బాధితులను వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శనివారం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న మరో ముగ్గురిని ఇప్పటికే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్య చికిత్సను అందిస్తున్న విషయం తెలిసిందే. జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో శుక్రవారం 25 పడకల సామర్థ్యంతో ప్రత్యేక డయేరియా వార్డును ఏర్పాటు చేశారు. అయితే డయేరియా బాధితుల సంఖ్య పెరగడంతో మరో 15 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలతో పాటు మెడిసిన్, అనస్థీషియా వైద్య నిపుణుల బృందంతో పాటు వైద్య సిబ్బంది నిరంతరం మూడు షిఫ్ట్‌లలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం 44 మంది బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

రేపటి నుంచి భీమేశ్వరాలయంలో దర్శనాలు

పునఃప్రారంభం



సామర్లకోట, జూన్ 15: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శివలింగ జీర్ణోద్ధారణ పనులు పూర్తయ్యి నందున సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించి 17న సోమవారం ఏకాదశి పర్వదినం నుంచి స్వామివారి దర్శనాలు యథాతథంగా భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. గత నెల 28 నుంచి భారతీయ పురావస్తు శాఖ ఆధీనంలో శివలింగ జీర్ణోద్ధారణ పనులు నిర్వహిస్తున్న విషయం విదితమే. జీర్ణోద్ధారణ పనులు శనివారం నాటికి పూర్తిచేసి ఆలయాన్ని తమకు భారతీయ పురావస్తు శాఖ అధికారులు అప్పగించడంతో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చర్యలకు సిద్ధం చేశామన్నారు. ఆదివారం సంప్రోక్షణ చర్యలు పూర్తి చేసి సోమవారం నుంచి భక్తులకు శివలింగ దర్శనాలు యథాతథంగా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా భారతీయ పురావస్తు శాఖ అధికారుల ఆదేశాల మేరకు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు ఈ నెల 23 వరకూ నిర్వహించేందుకు అనుమతులు లేనందున భక్తులు సహకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాగా బతికి..చితికిపోయి

ఫ్లైవోవర్‌పై నుంచి దూకి అన్నదమ్ముల ఆత్మహత్య

రాజమహేంద్రవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాగా బతికారు.. తర్వాత చితికిపోయారు.. తల్లిదండ్రులు మృతితో చూసేవారులేకపోయారు. అయిన వాళ్లకు దూరమయ్యారు.. ఒంటరిగా కాలం వెళ్లదీస్తూ మానసికంగా కుంగిపోయారు.. జీవితంపై విరక్తి చెంది చివరికి ఆ అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ముత్తాబత్తుల నాగాంజనేయ(42), ముత్తాబత్తుల దుర్గారామ్(40) అన్నదమ్ములు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శంభూనగర్ ప్రాంతంలోని సాయికృష్ణనగర్‌లోని సొంతింట్లో నివాసం ఉంటున్నారు. వీళ్లలో ఒకరు ఎంబీఏ, మరొకరు ఎంసీఏ చదివారు. సుమారు 15 ఏళ్ల కిందట బెంగళూరులో ఉద్యోగాలు చేసేవాళ్లు. తల్లి చాలా ఏళ్ల కిందటే చనిపోయారు. తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో సుమారు పదేళ్ల కిందట ఆయన బాగోగులు చూసుకోవాలంటూ ఉద్యోగాలు వదిలి వచ్చేసి ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో కరోనాకు ఏడాది ముందు తండ్రి కూడా మరణించాడు. ఏళ్ల తరబడి ఎలాంటి ఉపాధి లేకుండా ఉండడంతో అప్పుల్లో మునిగిపోయారని తెలుస్తోంది. ఈ క్రమంలో అన్నదమ్ములు ఒంటరిగా కాలం వెళ్లదీస్తున్నారు. అప్పులు చేయడం ఏదో ఒక ఊరు వెళ్లడం, లాడ్జీలో రూం తీసుకొని మళ్లీ కొద్ది రోజుల తర్వాత తిరిగి రావడం జరిగేది. ఎవరినీ ఇంటి లోపలకు రానిచ్చేవారు కాదు. ఇళ్లు కూడా శుభ్రం చేసుకోకపోవడంతో పాడుబడిన బంగ్లా మాదిరిగా తయారైంది. వాటర్ బాటిల్స్‌తో సహా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి రప్పించుకోవడం, ఆ సమయంలో మాత్రమే తలుపు తీసి వాటిని తీసుకోవడం జరిగేది. బయటకు అతి తక్కువగా కనబడడంతో పాటు బంధువులకు కూడా దూరంగా ఉంటూ వచ్చారు. ఇద్దరూ వివాహం చేసుకోలేదు. ఆలనాపాలనా కరువైంది. మానసికంగా కుంగిపోయారు. అప్పుల నిమిత్తం తమకు ఉన్న భూమిని కూడా ఇటీవలే అవతలి వారి పేరున రిజిస్ట్రేషన్ చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో పేషెంట్‌ను తీసుకెళ్లాలంటూ ఓ లాడ్జి నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అంబులెన్స్‌ను రప్పించుకున్నారు. రోడ్ కం రైలు బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం ఇలా తిప్పుతుండడంతో అంబులెన్సు డ్రైవరుకు అనుమానం వచ్చి లాడ్జి వద్ద దింపేస్తానని చెప్పాడు. కానీ తమను ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్‌పై దింపాలని వాళ్లు చెప్పడంతో డ్రైవరు నిరాకరించగా అతనితో వాగ్వివాదానికి దిగారు. చివరికి వాళ్లను తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఫ్లైఓవర్‌పై డ్రైవరు దింపేసి వెళ్లిపోయాడు. ఉదయం ఫ్లైఓవర్ కింద ఇద్దరు మృతి చెందిన స్థితిలో ఉన్నారని సమాచారం తెలియడంతో పోలీసులు వచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టారు. ఫ్లైఓవర్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చామని, కేసు దర్యాప్తులో ఉందని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. అయితే చుట్టుపక్కల ఇళ్ల వద్ద సుమారు కొంత మొత్తం అప్పు తీసుకున్న అన్నదమ్ములు తిరిగి తాము ఇవ్వలేమని అప్పు ఇచ్చిన వారికి చెప్పినట్లు తెలిసింది. .


దుర్గారామ్, నాగాంజనేయ మృతదేహాలు


బాధిత మహిళలందరికీ న్యాయం చేస్తాం

హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత


హోం మంత్రి అనితకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అంతర్వేది ఆలయ అధికారులు

అంతర్వేది, జూన్ 15: గత ఐదు సంవత్సరాల్లో వివిధ సంఘటనల్లో బాధితులుగా ఉన్న మహిళలు, సామాన్య ప్రజలకు భద్రత కల్పించే దిశగా పని చేస్తానని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని సహించేది లేదన్నారు. సామాన్యులు ఆస్తులు పోగొట్టుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అంతర్వేది ఆలయానికి వచ్చిన మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా గంజాయి, మత్తు పదార్థాలతో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని, యువత వాటి బారిన పడకుండా, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా పోలీసు శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో అమలాపురం, మోరిపోడుల్లో ఆడపిల్లలకు అన్యాయం జరిగినప్పుడు కుటుంబాలను పరామర్శించానని, భవిష్యత్తులో అటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. కూటమి విజయం సాధించిన తరుణంలో మలికిపురం నుంచి అంతర్వేది వరకు పాదయాత్ర చేస్తున్న అంతర్వేదిపాలెం పుల్లయ్యను హోం మంత్రి అనిత ఈ సందర్భంగా అభినందించారు.

ఆలయంలో పూజలు

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం విచ్చేశారు. ఎన్నికల సమయంలో దర్శించుకుని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరలా దర్శించుకుంటానని కోరుకున్నానన్నారు. ఈ నేపథ్యంలో దర్శనానికి వచ్చినట్లు చెప్పారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం చేయించి వేద పండితులతో మహదాశీర్వచనం ఇప్పించారు. మంత్రికి ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. నల్లా సత్యకిరణ్‌ప్రసాద్ భగవద్గీత, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని మోరి జీడిపప్పు అచ్చును హోం మంత్రికి బహూకరించారు. మంత్రి వెంట సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, వనమాలి మూలాస్వామి, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకట కృష్ణ, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి నాయకులు ఉన్నారు.

సత్యదేవుని దర్శనం

అన్నవరం, జూన్ 15: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ శనివారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో వారికి పట్టువస్త్రాలను, ప్రసాదం అందజేశారు. ముందుగా వినాయక అతిథి గృహానికి చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవవందనం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్వత సురేష్, పసుపులేటి చక్రి, రాజాల చిట్టిబాబు, పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యజమాని మోసం చేశాడంటూ యువకుడి బలవన్మరణం

పోలీసులు వాంగ్మూలం దాచడంపై అనుమానాలు



రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడడం వివాదాస్పదమైంది. ఈ యువకుడి మరణ వాంగ్మూలాన్ని పోలీసులు దాస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. గండూరి శ్రీకాంత్ (30) తన తల్లితో కలిసి రైల్వే క్వార్టర్‌లో ఉంటున్నాడు. తండ్రి చనిపోవడంతో ఆ ఉద్యోగం తల్లికి వచ్చింది. ప్రస్తుతం ఆమె రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ పెట్రోలు బంకులో శ్రీకాంత్ ఐదేళ్ల నుంచీ పనిచేస్తున్నాడు. బంకు యజమాని మేనల్లుడు అయిన శ్రీనుతో పరిచయం ఏర్పడింది. ఎక్కడైనా కార్లు ఆగిపోయినా.. లేదా ఇతర వాహనాలకు ఇద్దరూ కలిసి ఇంధనాన్ని తీసుకెళ్లి నింపడం జరిగేది. అలా తీసుకెళ్లినందుకు ఆ వాహనదారుల వద్ద నుంచి కొంత మొత్తం అదనంగా తీసుకునేవాళ్లు. ఆ ఆదాయం బాగానే ఉండేది. అయితే పెట్టుబడి పెట్టడానికి కాస్త ఇబ్బంది పడుతుండడంతో ఆ సంగతి తాను చూసుకుంటానని, లాభంలో 25 శాతం వాటా ఇస్తానని యజమాని చెప్పడంతో వాళ్లు అంగీకరించారని సమాచారం. శ్రీకాంత్ తన జీతం కూడా యజమాని వద్దే ఉంచేసేవాడని అంటున్నారు. వీళ్లకు వాటా కింద వచ్చిన మొత్తాన్ని కూడా యజమాని వద్ద పెట్టుబడిగా పెట్టారు. కొన్నాళ్ల తర్వాత తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడగ్గా ఆ యజమాని కాలయాపన చేస్తూ వచ్చాడు. గత గురువారం ఇస్తానని ఈ గురువారానికి (13)కి వాయిదా వేశాడు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న తన తమ్ముడికి కూడా ఫోన్ చేసి బాధపడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీకాంత్ ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. ఉదయం తల్లి ఉద్యోగానికి వెళ్లిన వెంటనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని శ్రీనుకు మెసేజ్ పెట్టాడు. అతడు వచ్చేలోగా ఘోరం జరిగిపోయింది. ఫ్యానుకు దుప్పటితో ఉరి వేసుకున్నాడు. అయితే తాను పెట్టుబడిగా పెట్టిన డబ్బులు తనకు రూ.35 లక్షల వరకూ వస్తాయని అవి వచ్చిన వెంటనే హైదరాబాద్ తమ్ముడి దగ్గరికి వెళ్లిపోదామని రెండున్నరేళ్ల నుంచీ అంటున్నాడని తల్లి రేణుకా దేవి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రోజు రేపు అంటూ యజమాని చెబుతుండడంతో మనస్తాపం చెంది ప్రాణాలు తీసుకున్నాడని రోదించారు. 'అమ్మా క్షమించు. ఓనరు నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. అందుకే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని ఓనరు పేరు స్పష్టంగా సూసైడ్ నోట్‌లో శ్రీకాంత్ పేర్కొన్నాడని తెలుస్తోంది. అయితే దర్యాప్తు కారణాలతో సూసైడ్ నోట్‌ని రహస్యంగా ఉంచుతున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

కువైట్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్


ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, జూన్ 15: కుటుంబ పోషణ కోసం దూర ప్రాంతానికి వెళ్లి మృత్యువాత పడిన కుటుంబాల బాధ వర్ణనాతీతమని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరరావు, ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ మృతి చెందారు. వారి మృతదేహాలను విమానంలో తొలుత కేరళకు, అక్కడి నుంచి విశాఖ పట్నానికి విమానంలో తరలించారు. స్థానిక అధికారులు విశాఖపట్నం వెళ్లి అంబులెన్స్‌లో వాటిని పెరవలి మండలానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆ కుటుంబాలను పరామర్శించడానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేవనే కారణంతో ఎక్కడికో వెళ్లి కుటుంబ పోషణ కోసం పనిచేస్తూ అగ్ని ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఇరు కుటుంబాలకు అందజేసినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మరికొంత ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్, అతికాల శ్రీను, పిప్పర రవి, రంగినీడి గంగాధరరావు, సింహాద్రి సత్యనారాయణ, బొడ్డు రామాంజనేయులు, భూపతిరాజు రవివర్మ, కట్లయ్య, తహశీల్దార్ సుధ పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రేపు బాలబాలాజీ తిరు కల్యాణోత్సవం

అప్పనపల్లిలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ




మామిడికుదురు, జూన్ 15: వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏడు ప్రదక్షిణలు ఏడు శనివారాలు చేసి ఏడు నారికేళాలు సమర్పించినంతనే కోరిన కోర్కెలు నెరవేర్చే శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణాన్ని 17వ తేదీ సోమవారం రాత్రి 8.59 గంటలకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేసి కల్యాణ శోభను తీసుకువచ్చారు. 16వ తేదీ ఆదివారం నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభమై 20వ తేదీ గురువారం వరకు శ్రీవారి శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఐదు రోజుల పాటు కల్యాణోత్సవాలను పురస్కరించుకుని పలు పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్వామివారి తిరు కల్యాణాన్ని చినజీయర్ స్వామివారి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈవో (...)గంధి మాధవి పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ కోరారు.

బాల బాలాజీ శనివారం ఆదాయం రూ.2,80,050

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,80,050 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని 3697 మంది దర్శించుకుని 3051 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

జీవ వైవిధ్య పరిరక్షణతో మానవ మనుగడ

దివాన్‌చెరువు, జూన్ 15: మానవాళి మనుగడకు జీవ వైవిధ్య పరిరక్షణ ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి బీఏవీ కృష్ణమూర్తి అన్నారు. లాలాచెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణా అకాడమీలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో రెండురోజుల పాటు నిర్వహించిన జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవవైవిధ్యం అందరి సంపద అన్నారు. ఈ జీవవైవిధ్యంను కాపాడుకుంటూ భావితరాలకు దానిని భద్రంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జీవవైవిధ్యం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. సాంప్రదాయ వైద్యాన్ని ప్రపంచానికి తెలియచెప్పిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. అలాగే జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు తక్షణం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు రాష్ట్రంలోని 14,300 జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలు ఉన్నాయన్నారు. అన్ని గ్రామ పంచాయతీలతో పాటు అర్బన్ ప్రాంతాలలో కూడా ఈ కమిటీలు ఉన్నాయని చెప్పారు. జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా జీవవైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణ కరదీపిక ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ, జీవవైవిధ్యమండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు బి.జానకీరామ్, డాక్టర్ చెన్నకేశవనాయక్, సత్యప్రసాద్, శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్ వి.శ్రీహరిగోపాల్, ఎన్.వి.శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలి సభ్యకార్యదర్శి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

తాటాకిల్లు, పశువుల పాకకు నిప్పు

పిఠాపురం, జూన్ 15: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారు సీతారాంపురంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటల సమయంలో వాసంశెట్టి రాంబాబుకు చెందిన తాటాకిల్లు, పశువుల పాక, గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్రమాదంలో ఇల్లు, పాక, గడ్డివాము పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉంచిన లక్ష రూపాయల నగదు, రూ. 3 లక్షలకు పైగా విలువైన సామగ్రి దగ్ధమయినట్లు రాంబాబు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొందరు వ్యక్తులు కక్ష కట్టి కావాలనే తన ఇంటికి నిప్పు పెట్టారని రాంబాబు తెలిపారు.

గుండెపోటుతో ఎస్ఐ మృతి



కోటనందూరు, జూన్ 15: కాకినాడ జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన పంపనబోయిన వెంకటరమణ (54) గుండెపోటుతో మృతిచెందారు. విజయవాడ కృష్ణలంకలో ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటరమణ డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి బాత్‌రూమ్‌కి వెళ్లి గుండెపోటుతో కుప్పకూలిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరమణ కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆర్మీలో పదవీ విరమణ చేసి ఎస్ఐగా చేరారు. సీఐడీ, వివిధ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు. పోలీసుల అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, జూన్ 15: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 2,85,020 అన్నదాన విరాళాలు రూ.52,591 ఆదాయం, కేశ ఖండన ద్వారా రూ.7,360, తులాభారం రూ.400, లడ్డూ ప్రసాదం ద్వారా 36,540, వెరసి రూ. 3,81,911 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం కేసులో ఇద్దరి అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ) , జూన్ 15 : డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం యర్రపోతవరంలో డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన కేసులో గ్రామ సర్పంచ్‌తో పాటు మరో వ్యక్తిని రామచంద్రపురం డీఎస్పీ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామకృష్ణ వివరాలు అందించారు. ఈనెల 8న రాత్రి యర్రపోతవరం లాకుల వద్ద ఉన్న డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎడమ చేతికి చెప్పుల దండ వేసి వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు బోర్డు మీద అవమానకర వ్యాఖ్యలు రాసి వేలాడదీశారన్నారు. దీనిపై విప్పర్తి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తనతో పాటు సీఐ దొరరాజు, ఎస్ఐలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు (బీసీ సామాజికవర్గం) కోరుకొండ స్వామినాయుడు (ఎస్సీ సామాజికవర్గం) ఇరువురు పథకం ప్రకారం 8వ తేదీ రాత్రి స్వామినాయుడు ఇంటిపక్క ఉన్న చెత్త కుప్ప నుంచి సేకరించిన మూడు చెప్పులతో దండగా కట్టి, తెల్లకాగితంపై కొన్ని వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా అవమానకర రీతిలో రాసి అట్టముక్కకు అంటించారు. తదుపరి ప్లాస్టిక్ వైరు కట్టి చెప్పుల దండ, బోర్డును అదే రోజు రాత్రి విగ్రహం ఎడమ చేతికి తగిలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, పలు రకాలు సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి వివిధ కోణాలలో సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించారు. నిందితులు నేరం అంగీకరించినట్లు డీఎస్పీ చెప్పారు. వారిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నేరానికి ఉపయోగించిన వస్తువులు, సెల్ ఫోన్లు, రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన దర్యాప్తు అధికారి డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్ఐ జానీబాషా, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రాజానగరం, జూన్ 15: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా రేషన్ బియ్యాన్ని కొనడం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. శనివారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని విజిలెన్స్ అధికారులు రాజానగరంలో స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి రాజానగరంలోని వాసవి ప్రియ పికిల్స్ సమీపంలో రేషన్ బియ్యం లోడుతో ఒక వ్యాన్ వెళ్తోందని వచ్చిన సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 10,450 కిలోల బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి గ్రామానికి చెందిన ఉప్పల ప్రకాష్‌కు చెందినవిగా అధికారులు నిర్ధారించారు. వాహన డ్రైవర్ కొత్తపల్లి నాగరాజు ఏలూరు నుంచి రాజానగరం మండలానికి రవాణా చేస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10,75,475 ఉంటుందని, నిందితులపై 6-ఏ కింద కేసు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదుకు పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ లోవరాజు, శివ, సీఎస్‌డీటీ దివాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూన్ 15: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి సుజాత శనివారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు, వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేసి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

పాఠ్య పుస్తకాలు అందజేత



పాఠ్య పుస్తకాలు అందించిన దృశ్యం

మోతుగూడెం, జూన్ 15: చింతూరు మండలం మోతుగూడెం లో శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఆకేటి సీత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 8,9,10 తరగతుల వరకు పుస్తకాలు అందజేస్తామని, బ్యాగులు ఇంకా రావాల్సి ఉందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పరిమళ దేవుడు, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రాజమహేంద్రవరానికి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాజమహేంద్రవరం రానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురందేశ్వరి ఆదివారం ఉదయం 11గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారని, మూడు రోజులపాటు జేఎన్ రోడ్డులోని కోస్టల్ అతిథిగృహంలో బస చేస్తారని ఆయన పేర్కొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

» కొమరిపాలెంలో అక్రమంగా రోడ్డు నిర్మాణాలు

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూన్ 15: కొమరిపాలెంలో అక్రమంగా రోడ్డు నిర్మాణాలు చేపట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కొమరిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రైవేటు లేఅవుట్‌కు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దేవదాయశాఖకు చెందిన స్థలంలో అనధికారికంగా రోడ్డు నిర్మించడాన్ని ఆయన గమనించారు. ఈ విషయంపై గ్రామస్థులు కూడా ఫిర్యాదు చేయడంతో రోడ్డు నిర్మించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. ఇదిలా ఉండగా శనివారం బలభద్రపురం శివారు కానేడులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో సంస్థ కార్మికులందరూ ఎమ్మెల్యే నల్లమిల్లిని కలసి అభినందించారు. అనంతరం వీరు తమ ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమంగా గత ఏడాది నవంబరు 28న లేఆఫ్ ప్రకటించిందని, ఫ్యాక్టరీని తెరపించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమాల్లో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల రాము, డీవీఆర్, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పడాల చినబుజ్జి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, కార్మిక సంఘ నాయకులు నాగేశ్వరరావు, రాంబాబు, రమణ, రవి పాల్గొన్నారు.

సామర్లకోట కెనాల్‌లో గుర్రపు డెక్కను తొలగించండి

అనపర్తి, జూన్ 15: రామవరంలో నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే నల్లమిల్లి సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులు నారుమడులు వేసుకునేందుకు సాగు నీరందడంలేదని, సామర్లకోట కెనాల్‌లో గుర్రపు డెక్క అధికంగా ఉన్నచోట తొలగించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. పనుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో కాకినాడ డివిజన్ డీఈ సహా పలువురు జేఈలు అధికారులు పాల్గొన్నారు. అనంతరం గుర్రపు డెక్కతో పూడుకుపోయిన సామర్లకోట, కొంకుదురు కాలువలను ఆయన పరిశీలించారు. అనపర్తిలోని దేవీచౌక్ వద్ద డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ఏర్పాటు చేసిన సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రయాణికులకు మిఠాయిలు పంచారు. కష్టపడి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కర్రి వెంకటరామారెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, రావాడ నాగు, విజయ పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు కోనాల వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా సమావేశంలో నల్లమిల్లి పాల్గొన్నారు. ఎన్నికల్లో తన విజయానికి కృషిచేసిన సోషల్ మీడియా టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



రామవరంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, రావాడ నాగు, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి శేషారత్నం, విజయ పాల్గొన్నారు. రామవరంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అభిమానులు మల్లిడి సురేంద్రరెడ్డి దంపతుల మొక్కును చెల్లించారు. అలాగే అనపర్తిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అభిమాని మొక్కును చెల్లించారు. కాగా కుతుకులూరుకు చెందిన తమలం పూడి రామారెడ్డి కాలినడకన వాడపల్లి వెంకన్నను దర్శించుకుని మొక్కు చెల్లిం చుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన నల్లమిల్లికి కోస్తాంధ్ర, కొంకు దురు రెడ్డి సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పలు శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. రాయవరం మండలం పసలపూడికి చెందిన బట్టీ యజ మాని వీర్రాఘవరెడ్డి ఎమ్మెల్యేని సత్కరించారు.

జోరుగా మట్టి తవ్వకాలు

అక్రమార్కులకు అధికారుల అండ?



ట్రాక్టర్‌పై తరలిపోతున్న మట్టి

గోకవరం, జూన్ 15: గోకవరం మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులకు అండదండలు పుష్కలంగా ఉండటంతో వారు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొత్తపల్లి, తిరుమలాయపాలెం, రంపయర్రంపాలెం, తంటికొండ, గోకవరం తదితర గ్రామాలలో చెరువులు కంకర గుట్టలు అధికంగా ఉన్నాయి. వేసవి కాలం కావడం, ఆపై చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణాలు, ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ ప్రాంతాలు అధికంగా ఉండడంతో అక్రమ వ్యాపారుల అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ముందుగా బట్టీ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకొని అధికారికంగానే మట్టి, గ్రావెల్ రవాణా సాగించేస్తున్నారు. ఈ తోలకాలు కూడా రాత్రనకా, పగలనకా నిరాటంకంగా సాగుతున్నాయంటే అక్రమార్కులు ఏవిధంగా రెచ్చిపోయి తవ్వకాలు సాగిస్తున్నారో, వారికి అధికారులు ఎంత సహకరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. మట్టి తోలకాలు జరిగే సమయాల్లో ట్రాక్టర్లు, లారీ డ్రైవర్లు ఒకరుకొకరు పోటీపడి వాహనాలను అతి వేగంగా నడపడం వల్ల ఎపుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని ప్రజలు భయపడుతున్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రాజమహేంద్రిని సమస్యల్లేని నగరంగా తీర్చిదిద్దుతా



కంబాలచెరువు వద్ద పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15: నగరంలో ముంపు సమ్యలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ఏపీపీ రోడ్డు వైట్ హౌస్ ఎదురుగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 10:30గంటలకు కంబాలచెరువు షాడే స్కూల్-ఆయకార్ భవన్ రోడ్డు, పుష్కరాలరేవు, ఆర్‌టీసీ కాంప్లెక్స్ రోడ్డులో డ్రైనేజీల్లో సిల్ట్ తీత పనులను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలెవ్వరు ఇబ్బంది పడకుండా మురుగునీరు, వర్షపు నీరు పారుదలకు ఆటంకం లేకుండా పూడిక తీత పనులు చేస్తున్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో చేసిన అనాలోచిత పనుల వల్ల నగరంలో చాలా ప్రాంతాలు నీట మునిగిపోతున్నాయన్నారు. రాజమహేంద్రవరంలో 42డివిజన్లకు సంబంధించి కూటమి నాయకులు ప్రతిరోజు ఉదయం 6గంటలకు శానిటరీ సిబ్బందితో కలిసి తిరుగుతూ సమీక్ష చేస్తూ సూచనలు ఇస్తారని చెప్పారు. క్వారీ సెంటర్‌కు చేరుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్లమెంట్ నమూనా భవన నిర్మాణం, అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు.త్వరలో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం పండగలా చేస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీసత్యనారాయణ, నగర అధ్యక్షుడు వైశ్రీను, నక్కాదేవి వరప్రసాద్, యిన్నమూరి దీపు, ఉప్పులూరి జానకిరామయ్య, దాస్యం ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉదయం 5 గంటలకు కంబాలచెరువు పార్కు తెరవండి..

ప్రతి రోజు ఉదయం 5 గంటలకు కంబాలపార్కు ఓపెన్ చేయాలని నిర్వాహకులకు రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. కంబాలచెరువు సెంటర్‌కు శనివారం ఉదయం వచ్చిన ఆయనకు వాకర్స్ తరపున ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి కలిసి సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నిర్వాహకులను పిలిచి ఉదయం 5గంటలకే కం బాలచెరువు పార్కు గేటు ఓపెన్ చేయాలన్నారు.

ఇద్దరు 'నన్నయ' అధ్యాపకులకు పీహెచ్‌డీలు



రామకృష్ణకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జూన్ 15: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగ అధ్యాపకులు సలాది రామకృష్ణకు, పెదపూడి సత్యరాఘవ విద్యాసాగర్‌కు డాక్టరేట్ పట్టాలను వీసీ ఆచార్య కె.పద్మరాజు శనివారం ప్రదానం చేశారు. డైటోపిక్ డైహైడ్రాజైడ్ అండ్ సెలెక్ట్ అమినో యాసిడ్స్‌తో కొన్ని డైవేలెంట్ ట్రాన్సిషన్ మెటల్ అయాన్ల బైనరీ అండ్ టెర్నరీ కాంప్లెక్స్‌ల సొల్యూషన్ ఈక్విలిబ్రియాపై కెమికల్ మోడలింగ్ స్టడీపై ఆచార్య ఎ.సత్యనారాయణ, ఆచార్య పి.శ్యామల మార్గదర్శకంలో రామకృష్ణ పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. అలాగే విద్యాసాగర్ సిల్వర్ నానోపార్టికల్స్ గ్రీన్ సింథసిస్, మాగ్నెటైట్ నానోపార్టికల్స్ అండ్ జింక్ ఆక్సైడ్ నానో పార్టికల్స్ సజల లీఫ్ ఎక్స్‌ట్రాక్టన్‌లను ఉపయోగించడం అలిసిస్, యాంటీ ఆక్సిడెంట్ అండ్ యాంటీ బాక్టీరియల్ అప్లికేషన్స్‌పై ఆచార్య కె.బసవయ్య పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారన్నారు. ఇద్దరు అధ్యాపకులను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ, అధ్యాపకులు బి.జగన్మోహనరెడ్డి, కె.దీప్తి తదితరులు అభినందించారు.

రైతు సమస్యలపై వినతి



కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ వెంకటరమణను కలిసిన నాయకులు

కడియం, జూన్ 15: కడియం రైతుల నుంచి ధాన్యం తీసుకుని ఇప్పటికే 52 రోజులు గడుస్తున్నా వారి ఖాతాల్లో సొమ్ములు పడక రైతులు ఇబ్బంది పడుతున్నారని జనసేన, బీజేపీ నాయకులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (ఎకౌంట్స్) టి.వెంకటరమణను కలిసి రైతుల సమస్యలు వివరించారు. రైతులకు తక్షణమే సొమ్ములు చెల్లించాలని కోరారు. దీంతో వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, గ్రీన్ లాండ్ బాబి, కందుకూరి సుబ్రహ్మణ్యం, దంగేటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించం

» వైద్యాధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూన్ 15: వైద్య సేవలందించడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలందించే దిశగా పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రధానంగా కుక్క కాటు, పాము కాటు మందులను అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ అందుబాటులో ఉంచాలన్నారు. బొబ్బిల్లంక గ్రామంలో ఆరోగ్య కేంద్రం నిర్వహించడానికి నూతన భవనం ఇంకా పునాది దశలోనే ఉందని, వైద్యసేవలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ వైద్యాధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులు రామభాస్కర్, చైతన్య, శ్రీవల్లి, బెనడిక్ట్, కోటి, యేసు రవి, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

అలాగే వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారి, డ్రైనేజీ అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల పరిస్థితి, పెండింగ్ పనులు, బిల్లులకు సంబంధించి బకాయిలపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ బిల్లులు, కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్అండ్‌బీ పనుల పూర్తి సమాచారంతో నివేదిక అందించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై నివేదిక అందించాలని ఎంఈవోలకు సూచించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని విద్యా ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా కృషి చేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా సకాలంలో అందేలా చూడాలని వ్యవసాయశాఖాధికారులకు సూచించారు. మాతాశిశు సంక్షేమానికి ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు చేసి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, డీఈఈ బీవీ మధుసూదనరావు, కోరుకొండ, రాజానగరం ఏఈఈలు జి.వీరన్నబాబు, వి.కిరణ్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జనార్దన్‌రావు, ఏపీఎం జయంతిరాజు, కె.హేమనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

ప్రపంచ రక్తదాన దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 15: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు విభాగాలు, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎం.కాస్మో, కె.వీరలక్ష్మి, పి.విజయలక్ష్మి, వీబీటీ సుందరి, బి.అనూరాధ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం : నీలాపు



సమావేశంలో మాట్లాడుతున్న నీలాపు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని రెల్లి కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అభినందనలు తెలిపారు. సమావేశంలో రెల్లి కులాల సంఘం జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బంగారు తాతారావు, ముత్యాల పెద్దబాబు, బంగారు నాగేశ్వరరావు, బంగారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మంత్రి దుర్గేష్ నివాసం



దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గన్నికృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 15 : మంత్రి దుర్గేష్ నివాసం శనివారం అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కిటకిటలాడింది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత శుక్రవారం ఆయన తొలిసారి రాజమహేంద్రవరంలోని నివాసానికి చేరుకున్నారు. దీంతో శనివారం పలువురు ఆయన నివాసానికి చేరుకుని అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. కృష్ణసాయి కల్యాణ మండపంలో శనివారం జరిగిన సమావేశంలో పేపరుమిల్లు విశ్రాంత ఉద్యోగులు దుర్గేష్‌కు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు జానకీరామయ్య, అర్జున్, వెంకట్రాజు, ఎస్‌వీ రెడ్డి, సీహెచ్ఎస్ వీరభద్రం, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యనమలను కలిసిన వంతల రాజేశ్వరి

తుని రూరల్,జూన్15: శాసన మండలి ప్రతిపక్ష నేత టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును తుని మండలం తేటగుంట టీడీపీ కార్యాలయంలో శనివారం రంపచోడవరం టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. యనమలను శాలువాతో సత్కరించి మొక్కను అందించారు.



యనమలను కలిసిన వంతల రాజేశ్వరి

నవ్య కవిత్వానికి బాటలు వేసిన శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15 : సామాజిక స్పృహతో కవిత్వాన్ని పాత పరిధిని దాటించి కొత్త పరిధిలోకి దూకించడం సాధారణ కవులకు సాధ్యమయ్యేదికాదని, అయితే శ్రీశ్రీ నవ్య కవిత్వానికి బాటలు వేస్తూ అభ్యుదయ కవిగా నిలిచారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ కొనియాడారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో శనివారం శ్రీశ్రీ వర్ధంతిని నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరపట్ల మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వాన్ని ఎలుగెత్తి పాడడానికి కావలసిన యమకం, తాళం తన కవిత్వంలో గుప్పించి మహాకవిగా వెలుగొందారన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, కళాశాల తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు, ఎస్.రాజకుమార్, కళాశాల సూపరింటెండెంట్ బీహెచ్‌వీవీ.మూర్తి, హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామనాయుడు, ఆకుల సత్యసాయి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

కోరుకొండ, జూన్ 14: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 6112 మంది విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు అందజేసినట్టు ఎంఈవో-1 టి.కుశలవ దొర, ఎంఈవో-2 సుజాత తెలిపారు. మండలంలోని 55 పాఠశాలలకు ఈ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. వీటిలో 14 హైస్కూల్స్ 5 యూపీ స్కూల్స్ 36 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు అవసరమైన 44730 నోట్‌పుస్తకాలు, 38418 గ్రాఫ్ పుస్తకాలు, 2390 పాఠ్యపుస్తకాలు అందజేశామన్నారు. 7వ తరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు విద్యార్థులకు సకాలంలో అందజేశామన్నారు. కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ నుంచి ఈ పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్షణ సిబ్బంది, క్రాఫ్ట్, ఆర్ట్ ఉపాధ్యాయులు పలువురు, ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాజానగరం, జూన్ 15: రాజానగరంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. బాబాకు నిత్య హారతులతో పాటు పాలాభిషేకం, అఖండ బిల్వార్చన జరిపించారు. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన నాగవరపు రామకృష్ణ దంపతులతో పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు.

50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ల పెంపు వర్తిస్తుందా

ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తరువాత పింఛన్లు రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం చేయడం అభినందనీయమని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 43లో 50ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీఎస్టీలకు పింఛన్ల పెంపు వర్తిస్తుందా లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇది అమలు చేయాలన్నారు. ఈ అనుమానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో ఆనందం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15: తమ నాయకుడు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తూ చేసిన సంతకంతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక చంద్రబాబు ఐదు హామీలపై సంతకాలు చేశారని చెప్పారు.

పేద మహిళకు తోపుడు బండి అందజేత



దోమరాజు రాధాకు తోపుడు బండిని అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 15: రాజమహేంద్రవరం 19వ డివిజన్‌కు చెందిన పేద మహిళ దోమరాజు రాధకు చిరు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అందించారు. ఆల్కట్ గార్డెన్స్ కన్నమ్మతల్లి గుడిసమీపంలో రాధ చిరువ్యాపారం చేసుకుని జీవిస్తుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమెకు తోపుడు బండి అవసరమని గుర్తించారు. ఈ మేరకు జీఎస్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష శనివారం తోపుడు బండిని అందించారు. వారి వెంట గొందేసి హరినాథ్ ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కోరుకొండ, జూన్ 15: కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారికి 108 కలశాలతో పంచామృత అభిషేకం, విశేష అర్చనలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. తదుపరి స్వామి వారి కల్యాణాన్ని ఆలయార్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సత్యభామ
సూర్యామినీ	: ముంజ్యా
సూర్యాప్యాలస్	: బ్యాడ్ బాయ్స్
స్వామి	: భజే వాయువేగం
శివజ్యోతి	: రక్షణ
అనుశ్రీ(సాయికృష్ణ)	: మనమే
రాజా	: బ్యాడ్ బాయ్స్
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: లవ్ మీ, ప్రేమించొద్దు
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	: గంగం గణేశా
వీఎస్ మహల్(నామవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వెంకటసూర్య(కడియం)	: మనమే
సత్యగౌరి (అనపర్తి)	: బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మనమే
రామకృష్ణ(కోరుకొండ)	:
గీతాసినిమాస్ (సీతానగరం)	:
శ్రీనివాస (గోకవరం)	: కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
నవయుగ(చింతూరు)	: ఆ ఒక్కటీ అడక్కు

కుక్కకాటును నిర్లక్ష్యం చేసి..

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 15 : కుక్కకాటును నిర్లక్ష్యం చేయడంతో ఒక మహిళ మృతిచెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన ఉస్సే ప్రియాంక (29) జనవరిలో కుక్క కాటుకు గురైంది. చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేసింది. అయితే గత 4 రోజులుగా ఆమెలో రేబిస్ లక్షణాలు కనిపించడంతో ఆమెను కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యుడి సూచన మేరకు శనివారం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది.



ఐదేళ్ల తరువాత ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

వచ్చే నెల 4న నోటిఫికేషన్ - 20న పోలింగ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మకమైన ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలను ఎట్టకేలకు జరగనున్నాయి.చివరగా 2013లో ఎన్నికల జరిగాయి. 2018లో తిరిగి జరగాల్సి ఉండగా 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా తమ నాయకులనే పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించి బ్యాంక్‌ను దోచుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలు జరగకుండా అడ్డుకుంది. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించింది. ఒక పక్క కోర్టు ధిక్కార కేసు కోర్టులో నడుస్తుండగా, మరొక పక్క అధికారులతో ఏర్పడిన త్రిసభ్య కమిటీ ఎన్నికలకు సిఫార్స్ చేయడంతో ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. జూలై 4న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే నెల 11 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 20వ తేదీన పోలింగ్ జరుగుతుంది.కూటమి నేతలు సరిగ్గా దృష్టిపెడితే పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ఇతర పార్టీలెవరైనా పోటీకి సై అంటే ఎన్నికలు జరుగుతాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఆర్యాపురం బ్యాంక్ సుమారు రూ.1080 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడే కాకుండా ఇతర జిల్లాలో కూడా బ్యాంక్ బ్రాంచిలు ఉన్నాయి. మొత్తం 16 బ్రాంచ్‌లు నడుస్తున్నాయి.రాజమహేంద్రవరం మెయిన్ బ్రాంచి, కాతేరు, తిలక్‌రోడ్‌లోని స్వరాజ్యనగర్, కోట గుమ్మం, బొమ్మూరు, దానవాయిపేట, దివాన్‌చెరువు, జెఎన్‌రోడ్డులలో బ్రాంచిలు ఇక్కడ ఉండగా గుంటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, విశాఖ, తణుకు, అమలాపురం, కాకినాడలలో ఒక్కో బ్రాంచి ఉన్నాయి. బ్యాంక్ పరిధిలో మొత్తం 95,096 మంది సభ్యులు ఉన్నారు. వారిలో ఓటు హక్కుకు అర్హత పొందిన వారు 79,531 మంది ఉన్నారు. రూ.300 కంటే షేర్ ధనం ఉండి సక్రమంగా లావాదేవీలు నిర్వహించని 15,565 మంది ఓటు హక్కు కోల్పోయారు. అర్హత పొందిన వారిలో కూడా ఓవర్ డ్యూస్ ఉంటే ఓటు కోల్పోతారు. జూలై 4వ తేదీలోపే బకాయిలు క్లియర్ అయితే వారికి ఓటు హక్కు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు.

4న నోటిఫికేషన్

ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 4న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.ఈ నెల 17న అన్ని బ్రాంచిలలో తాత్కాలిక ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 24వ తేదీ వరకూ ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27న బ్యాంక్ సీఈవో తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 4న నోటిఫికేషన్ జారీ చేస్తారు.11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు.అదే రోజు నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. 12తేదీ ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు పరిశీలిస్తారు. 13న 5 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు.20న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. 21న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

పిల్లల గుర్తింపు బహిర్గతం చేయవద్దు : జడ్జి

రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జువైనల్ జస్టిస్ యాక్ట్-2015పై పోలీసు,చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు స్పష్టమైన అవగాహన అవసరమని జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులకు జువైనల్ జస్టిస్(కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్-2015పై శనివారం అవగాహన కల్పించారు. పిల్లల గుర్తింపును ఎట్టి పరిస్థితుల్లోనూ బహిర్గతం చేయరాదన్నారు.చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టానికి జవాబుదారులవుతారని స్పష్టం చేశారు. చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ అండ్ దేర్ ప్రొటెక్షన్ యాక్ట్-2015పై డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు వివరించారు. కార్యక్రమంలో 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ జానీ బాషా, 3వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సి.రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఈదురుగాలుకు నేలవాలిన వృక్షాలు

సీతానగరంలో ఈదురుగాలులు

సీతానగరం, జూన్ 15 : ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలులు మండలంపై విరుచుకుపడ్డాయి. దీంతో ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. మండలంలో శనివారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. 10 నిమిషాల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పచ్చని చెట్లు నేలకొరిగాయి.చినకొండేపూడి నుంచి పెదకొండేపూడి వెళ్లే దారిలో, చినకొండేపూడి నుంచి చీపురుపల్లి వెళ్ళే దారిలోను చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చీపురుపల్లి రోడ్డులో చెట్టు విద్యుత్ స్థంభాలపై పడడంతో వైర్లు తెగి రోడ్డుపైనా పడిపోయియి దీం తో చినకొండేపూడి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక్కసారిగా వచ్చిన వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చస్తూ..బతకలేక!

ఎలా ఉన్నారని పలకరించేవారు లేరు.. తిన్నారా అని అడిగేవారు లేరు.. తల్లీతండ్రీ మృతితో ఒంటరివారిగా మారిన ఇద్దరు సోదరులు.. అన్నీ ఉన్నా ఏమీలేనివారిగా మారిపోయారు.. నడిపించే నాన్న.. తోడుగా ఉండే అమ్మ దూరమవడంతో కుంగిపోయారు.. చాలా కాలంగా బంధువులను తమ దగ్గరకు రానీయకుండా ఒంటరిగా బతుకుతున్నారు.. ఒకరు ఎంబీఏ.. మరొకరు ఎంసీఏ చదివినా.. లోకంలో నెగ్గుకురాలేక.. చస్తూ బతకలేక చివరకు ఆత్మహత్య చేసుకున్నారు.. ఈ విషాదఘటన రాజమహేంద్రవరంలో శనివారం జరిగింది.. - వివరాలు 6లో

డీఎస్పీకి ఆ ధైర్యం ఎక్కడిదో..

ఓట్ల కౌంటింగ్‌కు సరిగ్గా రెండు రోజుల ముందు ఓ డీఎస్పీపై వేటు పడింది.అతని అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు స్పందించి ఆ రోజు సాయంత్రానికి సాగనంపేశారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అయితే మళ్లీ వైసీపీ రావడం ఖాయమని 5న వచ్చి(4న కౌంటింగ్ జరిగిన విషయం తెలిసిందే) తిరిగి జాయినవుతానని ధీమాగా చెప్పారంటే అవినీతి అధికారులకు వైసీపీ ఏ స్థాయిలో కొమ్ముకాసేదో అర్థం చేసుకోవచ్చు.

ఎవరినీ వదలం : గోరంట్ల

వీఆర్‌వోల నుంచి తహశీల్దార్.. కలెక్టరేట్ వరకూ రెవెన్యూ అధికారులు చేసిన అవినీతి, అన్యాయాలపై విచారణ జరిపిస్తాం... వైసీపీ నేతలతో కుమ్మక్కయి తప్పులు చేసిన అధికారుల భరతం పడతాం.. రాష్ట్రంలో జగన్ మొదలు అవినీతికి పాల్పడిన వారందరినీ చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో రెవెన్యూ అధికారులు అనేక మంది ఎకరాల కొలదీ భూములను అన్యాక్రాంతం చేశారు. అవన్నీ బయటకు రప్పించి చట్టప్రకారం దోషులపై చర్యలు తీసుకుంటాం. సీనియర్ ఎమ్మెల్యేనైన నాకు కూడా ప్రొటోకాల్ పాటించకుండా ఇబ్బందులు పెట్టారు. ఇదీ శుక్రవారం జిల్లాలోని అధికారులకు ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి హెచ్చరిక..

నాడు.. నేడు చూడకుండా చేసి..

ఈ రెండు ఘటనలు వైసీపీ ప్రభుత్వంలో అధికారుల తీరు తెన్నులు బయటపెడతాయి.. ఆరోపణలతో విధుల నుంచి తొలగించిన ఒక డీఎస్పీ స్థాయి అధికారి..కౌంటింగ్ పూర్తయిన తరువాత విధుల్లో చేరిపోతానన్నాడంటే ఏమి ధైర్యమో అర్థం చేసుకోవచ్చు. ఇక సీనియర్ ఎమ్మెల్యే.. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు చేసిన హెచ్చరిక చూసినా నిజమే కదా అనిపించక మానదు.. ప్రభుత్వం మారడంతో అటువంటి అధికారులకు దడ పట్టుకుంది.. ఏ క్షణాన ఏమి తమ మెడకు చుట్టుకుంటుందోనని భయపడుతున్నారు..

అధికారుల్లో.. దడ..దడ



భయంతో వణుకుతున్న అవినీతి అధికారులు

- నాడు వైసీపీ పాలకులు చెప్పిందే వేదం
- ఫిర్యాదు చేసినా కేసుల్లేవ్.. అరెస్టుల్లేవ్
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ప్రతిపక్ష నేతల వినతులపై చిన్నచూపు
- అక్రమాలతో అంటకాగిన అధికారులు
- భయంభయంగా బతుకు
- ఎవరినీ వదిలేది లేదన్న గోరంట్ల
- విచారణ తప్పదన్న సంకేతాలు
- నేడు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఐపీసీని పక్కన పెట్టేశారు. వైసీపీ అక్రమాలతో అంటకాగారు. ఆ నాయకులు చెప్పిందే తడవుగా రంగంలోకి దూకారు. నిబంధనలను 'గాలి'వాటం చేశారు. చట్టాలను అతిక్రమించి 'అంతకుమించి' వ్యవహారాలు నడిపించారు. ప్రతిపక్షాలపై ప్రతాపం వెలగబెట్టారు. అన్యాయాన్ని కొత్త పుంతలు తొక్కించారు. ప్రకృతి వనరులను మింగేస్తున్నా కరెన్సీతో కళ్లు మూసుకున్నారు. బాధితులకు నరకం చూపించారు. పాపం ఊరికే పోదుగా.. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన సంచలనమైన తీర్పుతో వైసీపీ అరాచకాలతో అంటకాగిన అధికారుల వెన్నులో వణుకుపుడుతోంది. తలా పాపం తిలా పిడికెడు అన్నట్టుగా ఆ అధికారులను వెనకేసుకొచ్చిన ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్, విద్య, వైద్యం, పోలీస్, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, సెబ్, ఆర్టీఏ.. ఇలా కీలకమైన విభాగాల్లోని కొందరు అధికారులకు వైసీపీ నాయకుల అరాచక ఆదేశాలు మాత్రమే వినిపించాయి. ఉద్యోగ బాధ్యతలను వైసీపీలో కలిపేశారు. 'వైసీపీ రాజ్యం, జగన్ రాజు' అన్న చందంగా అడ్డూ అదుపూ లేకుండా రెచ్చిపోయారు.వైసీపీ నాయకుల దగ్గర నుంచి ఫోన్ వస్తే 'ఆ సైడే' పని జరిగిపోయేది. బాధితుల రోదన మౌన వేదన అయ్యేది. ఇప్పుడు 'వారి వంతు' వచ్చింది. ఏ క్షణం విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందో.. ఏ రోజు జైలుకు వెళ్లాల్సి వస్తుందో అని వణికిపోతున్నారు.కొందరు టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉండగా..బదిలీ పేరుతో వేరే ప్రాంతానికి పారిపోయే తంత్రాన్ని మరికొందరు ప్రయోగిస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే నిజాన్ని గుర్తుచేస్తూ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అక్రమాలకు కేరాఫ్‌గా.. రెవెన్యూ

వైసీపీలోని భూ అక్రమార్కులకు, కబ్జాదారులకు మేలు చేయడానికి ఫైళ్లను, వాటిలోని కాగితాలను ఇష్టా నుసారం తికమక చేశారనే ఆరోపణలున్నాయి. కంప్యూ టర్‌లో సైతం డేటాను వక్రీకరించారని తెలుస్తోంది. ఏ పని చేయాలన్నా రెవెన్యూ శాఖ వేలు కచ్చితంగా ఉంటుంది. ఈ క్రమంలో జిల్లా స్థాయి కార్యాలయంపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వైసీపీ నాయకుల సిఫారసు ఉండి చేతిలో డబ్బు పడితే కావాల్సిన సీటుకు పోస్టింగ్ వచ్చేదని చెబుతున్నారు.

ఇసుకలో మునిగేదెవరో..

ఏ రోడ్డు చూసినా భారీ ఇసుక లారీలు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచీ ఒక్క లారీ రోడ్డుపై కన బడడం లేదు.ఈ ఐదేళ్లు ఇసుకాసురులు గోదావరికి తీవ్ర గర్భశోకాన్ని కలిగిస్తుంటే ఎక్కడో ఢిల్లీలో ఉన్న నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌కి కనిపించింది. కానీ అక్రమానికి పక్కనే ఉన్న అధికారులు మాత్రం తమకేమీ కనబడడం లేదంటూ నటనను రక్తి కట్టించేవాళ్లు.ఒకటి కాదు, రెండు కాదు వందల లారీల్లో ఇసుక, మట్టి అక్రమంగా తవ్వుకుపోతున్నా ఎవరికి చెప్పాలో తెలియని దుస్థితిని ప్రజలు చూశారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే వాళ్లకు వైసీపీ నాయకులు బెదిరింపులు,అధికారుల అదిలింపులు తప్పేవికావు. ఇసుక అక్రమం పరాకాష్టకు చేరి గామన్ బ్రిడ్జి పీకలపైకి వచ్చింది. 57,58 పిల్లర్ల వద్ద బేరింగ్ పాడై కుంగి పోయింది. వైసీపీ నాయకులు, కొందరు అధికా రుల కలయికతో బ్రిడ్జికి ఆ దుస్థితి వచ్చింది. బ్రిడ్జిల స్పాన్ల (పిల్లర్లు)కు 500 మీటర్ల వరకూ ఇసుక తవ్వకాలు జరపకూడదనే కచ్చితమైన నిబంధనలు ఉన్నా ఇసుక తవ్వకాలు భారీ యంత్రాలతో రేయింబవళ్లు జరుగుతుం డేవి. ఈ తతంగం ప్రజలకు కనిపించినా, అధికారులకు కనిపించేది కాదు.రోడ్ కం రైలు బ్రిడ్జికి సమీపంలో ఇసు క తవ్వేస్తున్నారని సాక్షాత్తూ రైల్వే పోలీసులు జిల్లా ఉన్న తాధికారులకు నివేదిక ఇచ్చినా ఫలితం శూన్యం. ప్రతి రోజూ గోదావరిలో విపరీతంగా డ్రెడ్జింగ్ జరుగుతు న్నా.. కలెక్టర్ వెళ్లేసరికి అంతా గప్‌చుప్. ఆమె రీచ్‌కి వస్తున్నారని మరి ఎలా సమాచారం వెళ్లేదో ఇసుకకే తెలియాలి.

తరలిపోతుంటే వీళ్లేం చేశారో?

సెబ్, మైనింగ్ అధికారుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.ప్రకృతి వనరులు ముఖ్యంగా మట్టి, ఇసుక అక్రమంగా తరలిపోకుండా కాపాడే ప్రథమ బాధ్యత వారిపై ఉంది.కానీ కొందరు అధికారులు వైసీపీ నాయకులకు దాసోహమై అవినీతి సొమ్ముల కోసం చూసీ చూడనట్టు వదిలేశారు. ఫలితంగా వేల కోట్ల రూపాయల ప్రకృతి వనరులు వైసీపీ నాయకుల జేబు ల్లోకి వెళ్లిపోయాయి.ఈ పాపంలో రెవెన్యూ,పోలీస్ అధికారులు కొందరు తమదైన పాత్ర పోషించారు.రాజానగరం నియోజకవర్గం లో వైసీపీ నాయకులు ప్రకృతి వనరులను మింగేస్తుంటే.. కొండలను నేలమట్టం, చెరు వులను అగాధాలుగా చేస్తుంటే మైనింగ్, సెబ్,పోలీస్, రెవెన్యూ శాఖల్లోని కొందరు అధికా రులు ఇతోధికంగా సహాయపడ్డారు.అక్కడా 'రాజా'వారు చెప్పిందే వేదంగా పలువురు అధికారులు 'పని' చేసి పెట్టేవాళ్లు.

సెటిల్‌మెంట్..తహశీల్దార్?

నిడదవోలులో గతంలో తహశీల్దారుగా చేసి ప్రస్తుతం రుడాలో ఉన్నతస్థాయిలో ఉన్న ఓ అధికారి అక్కడ పని చేసే సమయంలో వైసీపీ ఎమ్మెల్యే అండతో భూ సెటిల్‌మెంట్లలో తీవ్రంగా అలసిపోయేవారు. ఆ ఎమ్మెల్యే చెప్పినట్టు చేసి.. పనికి తగిన మూల్యం పొందే వారు.గోపవరం గ్రామంలో పేదలకు ఉద్దేశించి ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లో నిబంధనల ప్రకారం కమ్యూనిటీ పర్పస్‌కి వదిలేసిన భూమిలో కూడా స్థలాలు అమ్ముకున్నారు. రోడ్డు పక్కన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వదల్లేదు. డబ్బులు పుచ్చుకొని ప్లాట్లు ఇచ్చేశారు.

ఆ డీఎస్పీ సంగతేంటో!

పోలీస్ డిపార్టుమెంట్లో వైసీపీకి అడ్డంగా కొమ్ముకాసినట్లు ఆరోపణలున్న ఓ డీఎస్పీ.. పైకి సౌమ్యుడిగా కనిపిస్తూ తనదైన పంథాలో వైసీపీ నాయకులకు ఏకపక్షంగా 'పనులు' చేసి పెట్టడంపై తీవ్ర ఆరోపణలున్నాయి. ఎన్నికలకు ముందే ఆ అధికారిపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు కూడా చేశారు. తాజా మాజీ ఎంపీ భరత్‌రామ్ తమకు రాష్ట్రాన్ని రాసిచ్చేసినట్టు వ్యవహరించేవారు. ఆయన ఏది చెబితే అది కొందరు అధికారులు కళ్లు మూసుకొని 'మామూలు'గా కానిచ్చేసేవాళ్లు. అక్రమాలకు ఎవరైనా ఎదురు చెబితే వేధింపులు తప్పేవికావు. ఓ టీడీపీ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని, మరో టీడీపీ నాయకుడిపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీఐలను ఆదేశిస్తే..వారు నిబంధనలకు విరుద్ధమంటూ సమాధానమిచ్చారు.వాళ్లను వీఆర్‌కి సాగనం పారు. ఉన్నతాధికారులు ఈ అక్రమాన్ని అడ్డుకోలేకపోయారు.

ఆ ముగ్గురిపై..ఆరోపణలు..

రాజమహేంద్రవరంలో ఓ విచిత్రమైన పరిస్థితిని జనం చూశారు. ఐదేళ్లు 'గాలి'కి వదిలేసి.. సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు విచ్చలవిడిగా మునిసిపాలిటీ సాధారణ నిధులతో అభివృద్ధి అంటూ విధ్వంసం సృష్టించారు. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ నాయకులు ఫలానా పని చేయాలని ఆదేశిస్తే ఇంకేముంది తమకూ కొంత పంట పండుతుందనే ఆశతో జనం సొమ్మును మంచినీళ్లలా ఖర్చు పెట్టేశారు.నాణ్యతను పట్టించుకోకుండా ఇష్టానుసారం రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలంటూ కోట్లాది రూపాయలు పోశారు. పార్కుల అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున అవినీతి జరిగిం దనే ఆరోపణలున్నాయి.ఒక వైసీపీ నేత అనుయాయులే కాంట్రాక్టర్లుగా వ్యవహరించడంతో నాణ్యతకు తిలోదకాలిచ్చేశారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన హోదాల్లో ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌పై టీడీపీ నేతలు పలుమార్లు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. వైసీపీ నాయకులు కలెక్టర్ ద్వారా జేసీ, కమిషనర్‌తో పనులు చక్కబెట్టుకునేవారనే విమర్శలున్నాయి. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గతంలోనూ తాజాగా తీవ్రంగా ఆగ్రహించారు.కనీసం ప్రొటోకాల్ కూడా పాటించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు చేశారు.

ఐపీసీని పక్కన పెట్టేసిన వైసీపీ..

ఎవరికైనా రక్షణ అవసరమైన సమయంలో గుడి కంటే ముందుగా పోలీస్ స్టేషన్‌కు వెళతాం. అయితే వైసీపీ ప్రభుత్వంలో కొన్ని పోలీస్ స్టేషన్లు వైసీపీ నాయకుల సెటిల్‌మెంటు కేంద్రాలుగా మారిపోయాయి. వైసీపీ నాయకులు నేరుగా పోలీస్ స్టేషన్ లోనే దందాలు చేసి అక్రమ సొమ్మును తలాకొంత సర్దుకునేవాళ్లు. వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఎవరు వెళ్లినా కొందరు పోలీసుల్లో పెద్దగా స్పందన కనిపించేదికాదు. పైగా ఫిర్యాదులో ఉన్న వైసీపీ నాయకుడికి సమాచారం వెళ్లిపో యేది. వాళ్లు పోలీస్ స్టేషన్‌కి రాకపోగా.. బాధితుడు మరింత బాధపడాల్సి వచ్చేది. వైసీపీ వాళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే ఓ పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చేది.లారీతో గుద్దించి చంపేస్తానంటూ ఓ రాజ స్థానీ మహిళను ఓ వైసీపీ నాయకుడు ఫోనులో బెదిరించినా చర్యల్లేవు.ఓ యువ లాయర్‌ని అర్ధరాత్రి వేళ చితక్కొట్టి తర్వాత కాళ్లు పట్టుకున్నంత పని చేసి నాలుగో సింహం పరువు తీశారు. ఎమ్మెల్యే విజేత బుచ్చయ్యచౌదరి పీఏని బహిరంగంగా వైర్ లెస్ సెట్‌తో రక్తం కారేలా కొట్టినా లైట్ తీసుకున్నారు.ఓ దళితుడికి పోలీస్ స్టేషన్లో శిరోముండనం చూసి చట్టం రోదించింది. న్యాయం కోరితే నా భర్త గుండు కొట్టేశాడని ఆశ్రయించిన వివాహి తను వైసీపీ నాయకుల అండ చూసుకుని ముప్పు తిప్పలు పెట్టారు.భారీ యంత్రాలతో ఇసుకను దోపిడీ చేస్తున్నా మామూళ్ల మత్తులో మునిగిపో యారు. సామాన్యుడి స్థలాలను వైసీపీ కబ్జాదారులు చెర బడుతున్నా కిక్కురుమనలేదు.చంద్రబాబును అక్రమంగా జైలులో ఉంచినపుడు టీడీపీ అభిమానులను సాధ్యమైనంత వేదనకు గురిచేశారు. సీఆర్పీసీ సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు చేశారు. వైసీపీ నాయకులకు మాత్రం అనధికారిక మినహాయింపునిచ్చారు. రోడ్డుపై వేడుకలు చేసు కున్నా లాఠీ విదిలించలేకపోయారు.

ఉల్లి..లొల్లి!





అదే దారిలో కూరగాయల ధరలు

- నెల రోజులుగా ఘాటెక్కుతున్న ఉల్లి
- కిలోకు రూ.15 వరకూ పెరుగుదల
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.45
- రైతు బజార్‌లో కిలో రూ. 32
- టమాటా కిలో రూ. 60
- ఇష్టారాజ్యంగా వ్యాపారుల అమ్మకాలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15 : ఒక పక్క ఉల్లిపాయలు.. మరోపక్క కూరగాయలు.. సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉల్లిపాయల ధరలు కన్నీళ్లు తెప్పించేలా పెరుగుతుండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల ధరలు చాపకింద నీరులా రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మంచి నాణ్యత కలిగిన ఉల్లిపాయలు రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.30ల వరకూ ధర పలుకుతున్నాయి. రిటైల్ వ్యాపారులు వీటిని రూ.40 నుంచి రూ.45ల వరకూ విక్రయిస్తుండడం గమనార్హం.రాజమహేంద్రవరం రైతు బజార్లలో క్వాలిటీ అంతంతమాత్రంగా ఉండే చిన్న ఉల్లిపాయలనే కిలో రూ.32లకు విక్రయిస్తున్నారంటే ఉల్లి ధరల పెరుగుదల ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లన్నీ మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే ఆధారపడి ఉంటాయి. బళ్లారి, కర్నూలు పాయలు మార్కెట్లోకి వచ్చినా అవి సీజన్‌లో మాత్రమే కనిపిస్తాయి. దీంతో మహారాష్ట్ర ఉల్లిపాయలు ఏడాది పొడవునా లభించడంతో వీటిపైనే మార్కెట్లన్నీ ఆధారపడి ఉంటాయి. మహారాష్ట్ర పాయలు పెద్దవిగా ఉండడంతో హోటళ్లు, ఫంక్షన్లకు వీటినే ఎక్కువగా వాడుతుంటారు. దీంతో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లకు ఉల్లిలోడులు రావడం బాగా తగ్గింది. ఇటీవల కాలంలో రాజమహేంద్రవరం చుట్టుపక్కల హోల్‌సేల్ మార్కెట్లు కొత్తగా వెలిశాయని, కొత్తవ్యాపారులు మహారాష్ట్ర నుంచి నేరుగా సరుకు రప్పించుకుంటున్నారని, దీంతో లోకల్ మార్కెట్‌కు సరుకు కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. కొత్త ఉల్లిపాయలు రావాలని లేకపోతే గొడౌన్లలో దాచిన ఉల్లిపాయలు బయటకు తేవాలని, అప్పుడు కానీ ధరలు తగ్గే అవకాశం లేదని చెబుతున్నారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి రూ.100లకు ఐదు కిలోలు,ఆరు కిలోలు అంటూ మైకులతో హోరెత్తించే ఆటోలు ఇప్పుడు వీధుల్లో ఎక్కడా కనిపించడంలేదు.

కూరగాయల పరిస్థితి ఇంతే..

ఉల్లిపాయల ధరలతో పాటు కూరగాయలు కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్టు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకూ పచ్చిమిర్చి ఘాటెక్కిస్తే ఇప్పుడు టమాటా వంతు వచ్చింది. బహిరంగ రిటైల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.60లపైనే ధర ఉంది. టమాటా మన ప్రాంతంలో ఎక్కడా సాగు చేయడం లేదు. ప్రస్తుతం ఇక్కడి వ్యాపారులంతా చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచే దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధర భారీగానే పెరిగింది. కొద్ది రోజుల కిందట కిలో రూ.80-90ల వరకూ వెళ్లిన పచ్చిమిర్చి ఇప్పుడు రూ.60కి తగ్గింది. బహిరంగ రిటైల్ మార్కెట్‌లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.60 వరకూ అమ్ముతుంటే, బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.60, బీరకాయలు రూ.70, చిక్కుళ్లు రూ.100ల వరకూ విక్రయిస్తున్నారు. రైతుబజార్లలోనూ ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నాయి. దొమ్మేరు వంకాయలు కిలో రూ.40, గులాబీ రకం రూ.28, తెలుపు రూ.28ఉంది.బెండకాయలు రూ.36, పచ్చిమిర్చి రూ.46, కాకరకాయ రూ.36, చిక్కుళ్లు రూ.76, చేమదుంపలు రూ.44, బీన్స్ గింజలు రూ.130, ఆనబకాయ రూ.25.. ఇలా కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది.

వాతావరణ పరిస్థితుల ప్రభావం..

ఉల్లిపాయలు, కూరగాయల ధరల హెచ్చుతగ్గుల విషయంలో వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుత ఎండలతో కూరగాయల పంటలకు పెద్ద నష్టం లేకపోయినా భారీ వర్షాలు పడితే మాత్రం నష్టం తప్పదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. వర్షాలు ఎక్కువగా పడితే బీర, దొండ, ఆనబ, పొట్ల, కాకరకాయ, చిక్కుళ్లు వంటి పాదులు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది.వంకాయలు, బెండకాయ తోటలకు ఇబ్బందిలేకపోయినా పూతరాలిపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. ఇలా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైతే ధరలు దిగివచ్చే అవకాశం ఉండదు. సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం మరి కొన్నాళ్లపాటు ధరల భారాన్ని మోయక తప్పదనే అభిప్రాయం వ్యాపార వర్గాల నుంచి వినిపిస్తోంది.



ఇసుకాసురులను వదిలేసి..

డ్రైవర్లపై కేసులా?

కొవ్వూరు, జూన్ 15 : ప్రభుత్వం మారినా ఇసుకాసురులు మాత్రం ఆగడం లేదు. ఏదో విధంగా దోచుకునేందుకు తెగబడుతున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 2 లారీలు, బుల్ ఎక్సవేటర్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. కొవ్వూరు వాడపల్లి రోడ్‌లోని ఎరినమ్మఘాట్ ఇసుక ర్యాంపు నుంచి మండలంలోని వేములూరు గ్రామంలోని వెంకటేశ్వరనగర్ లేఅవుట్‌లోకి ఇసుక తరలించి అక్రమంగా ఇసుక డంపింగ్ చేస్తున్నారు. అనధికారికంగా ఇసుక నిల్వచేసి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీచేశారు. దీనిలో భాగంగా ఇసుక తరలిస్తున్న 2 లారీలు, 126 క్యూబిక్ మీటర్ల ఇసుక, ఇసుక లోడ్‌చేసే ట్రాక్టర్ బుల్, 210 నంబరు ఎక్సవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు డ్రైవర్లపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కొవ్వూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సమయంలో కూడా లారీ డ్రైవర్‌పైనే కేసు నమోదు చేసి ఇసుకాసురులను వదిలేశారు.ఈ సారి అదే విధంగా డ్రైవర్లపై కేసు నమోదు చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు దోషులను పట్టుకుని అరెస్టు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆసుపత్రిలో సాధారణ కాన్పులు పెంచాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి



ఉండ్రాజవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డాక్టర్ రాజకుమారి

ఉండ్రాజవరం, జూన్ 15: ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వ చేసిన గదిని, వ్యాక్సిన్‌లను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు పెంచాలని సూచించారు. మోర్త గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషాదేవి, ఎమ్‌పీహెచ్‌ఈవో బాపిరాజు, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కెడీఎల్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై హర్షం

కొవ్వూరు, జూన్ 15:ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు రెండో సంతకం చేయడంపై టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి కేవీకే రంగారావు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రమాణ స్వీకారం అనంతరం సంతకాలు చేసి నిలబెట్టుకున్నారన్నారు. అలాగే పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో తొలగించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో అనేక లోపాలున్నాయని, వెబ్‌ల్యాండ్‌లో లేని సర్వే నెంబర్లతో అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, వాటిని రద్దు చేయాలన్నారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను రద్దు చేసి సబ్ రిజిష్టార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

'కువైట్' బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



అన్నవరప్పాడులో మృతుడి కుమార్తెను ఓదారుస్తున్న మంత్రి కందుల

పెరవలి, జూన్ 15: కుటుంబ పోషణ కోసం దూర ప్రాంతానికి వెళ్లి మృత్యువాత పడిన కుటుంబాల బాధ వర్ణనాతీతమని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరరావు, ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ మృతిచెందారు. వారి మృతదేహాలను విమానంలో తొలుత కేరళకు, అక్కడి నుంచి విశాఖపట్టణంలో విమానంలో తరలించారు. స్థానిక అధికారులు విశాఖపట్టణం వెళ్లి అంబులెన్స్‌లో వాటిని పెరవలి మండలం తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆ కుటుంబాలను పరామర్శించడానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేవనే కారణంతో ఎక్కడికో వెళ్లి కుటుంబ పోషణ కోసం పనిచేస్తూ అగ్ని ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేశారని చెప్పి ఇరు కుటుంబాలకు అందజేశామన్నారు. ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మరికొంత ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, అతికాల శ్రీను, పిప్పర రవి, రంగినీడి గంగాధరరావు, సింహాద్రి సత్యనారాయణ, బొడ్డు రామాంజనేయులు, భూపతిరాజు రవివర్మ, కట్లయ్య, తహశీల్దార్ సుధ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలి

కొవ్వూరు, జూన్ 15: అధ్యాపకులు మారుతున్న కాలనికి అనుగుణంగా ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఏబీఎస్ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. కళాశాలలో టెక్నాలజీపై నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇంగ్లీషు, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఆఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాధాన్యతను నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి వివరించారు.

గోష్పాదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం



కొవ్వూరు, జూన్ 15: కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మహిళలు ఆలయ ప్రాంగణంలోని కోనేరులో నీటిని బిందెలతో తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు విశేష పూజలు చేశారు. నీరాజనం సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మల్లిపూడి కుటుంబానికి జవహర్ పరామర్శ

తాళ్లపూడి, జూన్ 15: మండలంలోని గజ్జరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు మల్లిపూడి చంద్రరావు కుటుంబాన్ని శనివారం టీడీపీ జా తీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ పరామర్శించారు. కార్యక్రమంలో కోడూరి ప్రసాదు, వేగు సత్యనారాయణ, దండమూడి శేషు, మల్లిపూడి బాపూజీ, కొప్పాక పోసియ్య, మల్లిపూడి రాంబాబు పాల్గొన్నారు.


విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్ పోటీలు



విద్యార్థులకు యోగాసనాలు నేర్పుతున్న యోగా గురువు వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, జూన్ 15: ఈ నెల 21న యోగా దినోత్సవం సందర్భంగా గాయత్రీ యోగా సమితి యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేగేశ్వరపురంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. అనంతరం చిత్రలేఖనం, చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



స్వామి వారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

దేవరపల్లి, జూన్ 15: దేవరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేసింది.

నేడు రాజమహేంద్రవరానికి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం రాజమహేంద్రవరం రానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురందేశ్వరి ఆదివారం ఉదయం 11గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారని, మూడు రోజులపాటు జేఎన్ రోడ్డులోని కోస్టల్ అతిథిగృహంలో బస చేస్తారని ఆయన పేర్కొన్నారు.

గ'లీజు'పై..గరం..గరం

- కొవ్వూరు కౌన్సిల్‌లో షాపుల అద్దెపై రచ్చ రచ్చ
- 20 ఏళ్లు దాటిన షాపుల లీజు రద్దు చేయాలి
- బినామీలను తొలగించాలి.. కొత్త టెండర్లు పిలవాలని డిమాండ్
- షాపుల అద్దె పెంపులో నిబంధనలు పాటించాలి
- మున్సిపల్ షాపుల అద్దె పొడిగింపు వాయిదా

కొవ్వూరు, జూన్ 15: మున్సిపల్ కమర్షియల్ షాపులకు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి బినామీలను తొలగించి కొత్తగా టెండర్లు పిలవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం జరిగింది. అజెండాలో పొందుపర్చిన 1వ, 19వ అంశాలు మున్సిపల్ షాపులు లీజు పొడిగింపుపై కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, రుత్తల భాస్కరరావు మాట్లాడారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కొవ్వూరులో గలీజు, మున్సిపల్ కమర్షియల్ షాపింగ్ అద్దె విషయంలో కక్కుర్తి అని ప్రచురితమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రైవేటు షాపులు రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు పైనే అద్దెలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మున్సిపల్ షాపుల్లో అద్దెకు ఉంటున్న లీజుదారులు తమ ప్రైవేటు షాపులను అధిక ధరలకు అద్దెకు ఇస్తున్నారన్నారు. బాపూజీ కూరగాయల మార్కెట్ మెయిన్ బిల్డింగ్‌లో 1వ నెంబరు షాపు రూ.11,485 ఉండగా మిగిలిన షాపులు అద్దె పెంపుదల సమయంలో చుట్టుప్రక్కల అద్దె రూ.3500 ఉందని అజెండాలో ఎలా పొందుపర్చారని నిలదీశారు. బయట షాపులు ఎలా ఉన్నా మున్సిపల్ షాపుల అద్దెను పరిగణనలోకి తీసుకోకపోవడం అధికారుల పారదర్శకతకు అద్దం పడుతుందన్నారు. మార్కెట్‌లో అద్దెల ఆదారంగా మున్సిపల్ షాపుల అద్దెలను పెంపుదల చేయాలన్నారు. లీజు తీసుకుని 20ఏళ్ల పూర్తయిన షాపుల లీజును రద్దుచేసి మరలా టెండరు పిలవాలన్నారు. 1, 19 అంశాలను వాయిదా వేయాలని కోరారు. చైర్‌పర్సన్ 1వ అంశాన్ని లీజుదారులతో సంప్రదించి చర్యలు తీసుకోవాలన్నారు. 19వ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సూరపనేని చిన్ని మాట్లాడుతూ బాపూజీనగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారులతో షరతులతో కూడిన లీజు ఒప్పందం చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు సూచించారు. వేములూరులోని అవంతీ వెనుక కాలనీ, జగనన్న కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. పారిశుధ్య కార్మికుల అటెండెన్స్ సచివాలయాల్లో కాకుండా మున్సిపల్ కార్యాలయంలో పెట్టాలన్నారు. వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడకుండా కొంగల బాడవ, అవుట్‌లెట్ డ్రైనేజీలను పూడికలు తీయించాలన్నారు. తమ పరిధిలోని వార్డుల్లోని సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శించిన సచివాలయ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏడాదిగా గోదావరి బండ్ అంతా మట్టిపట్టేసిందని, మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి వాకింగ్ చేసుకోవడానికి అనుమతివ్వాలన్నారు. 9వ వార్డులో పారిశుధ్య సిబ్బందిని ఎందుకు మార్పు చేశారని నిలదీశారు. కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఏడాదిగా ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. ఆ పనులను రద్దుచేసి మరలా టెండర్లు పిలిచి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కారసాల వీరాంజనేయులు తమ 0.40 సెంట్ల భూమిని పారిశ్రామిక వినియోగానికి అనువుగా మార్పుచేయాలన్న అంశాన్ని వాయిదా వేయాలన్నారు. దీంతో 10వ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. రత్నకుమారి మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందితో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. వీధి దీపాల డ్రైవర్స్ తరచుగా పాడైపోతున్నాయని, పాడైపోయిన చోట వెంటనే ట్యూబులైట్లు వేసి వెలిగించాలని ఆదేశించామన్నారు. పారిశుధ్య కార్మికుల అటెండెన్స్ మున్సిపల్ కార్యాలయంలో పెట్టాలని కమిషనర్ కె.డానియేల్ జోసఫ్‌కు సూచించారు.



చైర్‌పర్సన్ రత్నకుమారి, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

భూమిని కాపాడుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు



భూసార పరీక్ష చేసేందుకు మట్టిని సేకరిస్తున్న సిబ్బంది

గోపాలపురం, జూన్ 15: భూమి తల్లిని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. శనివారం మండలంలోని జగన్నాథపురంలో మండలస్థాయిలో భూసార శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి భూసార పరీక్ష చేసేందుకు మట్టిని సేకరించారు. సర్పంచ్ ఈడ్పిన రామసత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాధవరావు మాట్లాడుతూ రైతులు నేలపై పంటకు పెట్టే ప్రతి రూపాయి సద్వినియోగమై అధిక దిగుబడులు పొందాలంటే నేలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి రైతు తీసుకోవాలన్నారు. ఏటా పంటల అనంతరం వేసవిలో మట్టిని సేకరించి భూసారా పరీక్షలు చేయించుకోవడం ద్వారా నెలలో ఏ పోషకాలు ఎంతెంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చని, నాణ్యమైన పంటను దిగుబడి చేసుకోవచ్చని చెప్పారు. అధిక దిగుబడులు ఆశించిన రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడుతున్నారని, దీంతో పంటతో పాటు నేల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. దీని ప్రభావంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. రైతులు జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పైర్లను పంట వేయడానికి ముందుగానే పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజారావు, రైతులు పసుమర్తి పెద్దబ్బులు, సుబ్రహ్మణ్యం, కాట్రగడ్డ సురేష్, సచ్చితానంద, వివేకనంద పాల్గొన్నారు.

బాగా బతికి..చితికిపోయి..

అన్నదమ్ముల ఆత్మహత్య!

- కుంగదీసిన ఒంటరితనం.. రాజమహేంద్రవరంలో ఘటన



మృతులు నాగాంజనేయ, దుర్గారామ్

రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బాగా బతికారు.. చితికిపోయారు.. తల్లిదండ్రులు మృతితో చూసేవారులేకపోయారు. అయిన వాళ్లకు దూరమయ్యారు.. ఒంటరిగా కాలం వెళ్లదీస్తూ మానసికంగా కుంగిపోయారు.. జీవితంపై విరక్తి చెంది చివరికి ఆ అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ముత్తాబత్తుల నాగాంజనేయ(42), ముత్తాబత్తుల దుర్గారామ్(40) అన్నదమ్ములు. రాజమహేంద్రవరం శంభూనగర్ ప్రాంతంలోని సాయికృష్ణ నగర్‌లోని సొంతింట్లో నివాసం ఉంటున్నారు. వీళ్లలో ఒకరు ఎంబీఏ, మరొకరు ఎంసీఏ చదివారు. సుమారు 15 ఏళ్ల కిందట బెంగళూరులో ఉద్యోగాలు చేసేవాళ్లు. తల్లి చాలా ఏళ్ల కిందటే చనిపోయారు. తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో సుమారు పదేళ్ల కిందట ఆయన బాగోగులు చూసుకోవాలంటూ ఉద్యోగాలు వదిలి వచ్చేసి ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో కరోనాకు ఏడాది ముందు తండ్రి కూడా మరణించాడు. ఏళ్ల తరబడి ఎలాంటి ఉపాదీ లేకుండా ఉండడంతో అప్పుల్లో మునిగిపోయారని తెలుస్తోంది.ఈ క్రమంలో అన్నదమ్ములు ఒంటరిగా కాలం వెళ్ల దీస్తున్నారు. అప్పులు చేయడం ఏదోక ఊరు వెళ్లడం, లాడ్జీలో రూం తీసుకొని మళ్లీ కొద్దిరోజుల తర్వాత తిరిగి రావడం జరిగేది. ఎవరినీ ఇంటి లోపలికి రానిచ్చేవారు కాదు. ఇల్లు కూడా శుభ్రం చేసుకోకపోవడంతో పాడుబడిన బంగ్లా మాదిరిగా తయారైంది. వాటర్ బాటిల్స్‌తో సహా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి రప్పించుకోవడం, ఆ సమయంలో మాత్రమే తలుపు తీసి వాటిని తీసుకోవడం జరిగేది. బయటకు అతి తక్కువగా కనబడడంతో పాటు బంధువులకు కూడా దూరంగా ఉంటూ వచ్చారు. ఇద్దరూ వివాహం చేసుకోలేదు. అలనాపాలనా కరువైంది. మానసికంగా కుంగిపోయారు. అప్పుల నిమిత్తం తమకు ఉన్న భూమిని కూడా ఇటీవలే అవతలి వారి పేరున రిజిస్ట్రేషన్ చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో పేమెంట్‌ను తీసుకెళ్లాలంటూ ఓ లాడ్జి నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అంబులెన్స్‌ను రప్పించుకున్నారు. రోడ్ కం రైలు బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం ఇలా తిప్పుతుండడంతో అంబులెన్సు డ్రైవరుకు అనుమానం వచ్చి లాడ్జి వద్ద దింపేస్తానని చెప్పాడు. కానీ తమను ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్‌పై దింపాలని వాళ్లు చెప్పడంతో డ్రైవరు నిరాకరించగా అతనితో వాగ్వాదానికి దిగారు. చివరికి వాళ్లను తెల్లవారు జామున సుమారు 3గంటల సమయంలో ఫ్లైఓవర్‌పై డ్రైవరు దింపేసి వెళ్లిపోయాడు. ఉదయం ఫ్లైఓవర్ కింద ఇద్దరు మృతి చెందిన స్థితిలో ఉన్నారని సమాచారం తెలియడంతో పోలీసులు వచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చామని, కేసు దర్యాప్తులో ఉందని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. చివరిగా స్థానికుల వద్ద సుమారు కొంత మొత్తం అప్పు తీసుకొని.. మళ్లీ తిరిగి ఇవ్వలేమని చెప్పడం గమనార్హం.

యజమాని మోసంతో యువకుడి బలవన్మరణం!

- మరణ వాంగ్మూలం దాస్తున్న పోలీసులు
- దానిలో పేర్లు రాసినా అరెస్టుకు తాత్సారం



శ్రీకాంత్ (ఫైల్)



ఉరి వేసుకున్న శ్రీకాంత్

రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడడంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. స్థానికులు, స్నేహితుల వివరాల ప్రకారం.. గండూరి శ్రీకాంత్(30) తన తల్లితో కలిసి రైల్వే క్వార్టర్‌లో ఉంటున్నాడు. తండ్రి చనిపోవడంతో ఆ ఉద్యోగం తల్లికి వచ్చింది. ప్రస్తుతం ఆమె రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ పెట్రోలు బంకులో శ్రీకాంత్ ఐదేళ్ల నుంచీ పనిచేస్తున్నాడు. బంకు యజమాని మేనల్లుడు అయిన శ్రీనుతో పరిచయం ఏర్పడింది. ఎక్కడైనా కార్లు ఆగిపోయినా.. లేదా ఇతర వాహనాలకు ఇద్దరూ కలిసి ఇంధనాన్ని తీసుకెళ్లి నింపడం జరిగేది. అలా తీసుకెళ్లినందుకు ఆ వాహనదారుల వద్ద నుంచి కొంతమొత్తం అదనంగా తీసుకునేవాళ్లు. ఆ ఆదాయం బాగానే ఉండేది. అయితే పెట్టుబడి పెట్టడానికి కాస్త ఇబ్బంది పడుతుండడంతో ఆ సంగతి తాను చూసుకుంటానని, లాభంలో 25శాతం వాటా ఇస్తానని యజమాని చెప్పడంతో వాళ్లు అంగీకరించారని సమాచారం. శ్రీకాంత్ తన జీతం కూడా యజమాని వద్దే ఉంచేసేవాడని అంటున్నారు. వీళ్లకు వాటా కింద వచ్చిన మొత్తాన్ని కూడా యజమాని వద్ద పెట్టుబడిగా పెట్టారు. కొన్నాళ్ల తర్వాత తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడగ్గా ఆ యజమాని కాలయాపన చేస్తూ వచ్చాడు. గత గురువారం ఇస్తానని ఈ గురువారానికి(13)కి వాయిదా వేశాడు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న తన తమ్ముడికి కూడా ఫోన్ చేసి బాధపడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీకాంత్ ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. ఉదయం తల్లి ఉద్యోగానికి వెళ్లిన వెంటనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని శ్రీనుకు మెసేజ్ పెట్టాడు. అతడు వచ్చేలోగా ఘోరం జరిగిపోయింది. ఫ్యానుకు దుప్పటితో ఉరి వేసుకున్నాడు. అయితే తాను పెట్టుబడిగా పెట్టిన డబ్బులు తనకు రూ.35 లక్షల వరకూ వస్తాయని అవి వచ్చిన వెంటనే హైదరాబాద్ తమ్ముడి దగ్గరికి వెళ్లిపోదామని రెండున్నరేళ్ల నుంచీ అంటున్నాడని తల్లి రేణుకా దేవి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రోజు రేపు అంటూ యజమాని చెబుతుండడంతో మనస్తాపం చెంది ప్రాణాలు తీసుకున్నాడని రోదించారు. 'అమ్మా క్షమించు. ఓనరు కర్రి సూర్యనారాయణరెడ్డి నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. అందుకే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్‌లో శ్రీకాంత్ పేర్కొన్నాడని తెలుస్తోంది. అయితే దర్యాప్తు కారణాలతో సూసైడ్ నోట్‌ని రహస్యంగా ఉంచుతు న్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

ఎమ్మెల్యే ముప్పిడికి అభినందనలు



కొవ్వూరు, జూన్ 15: ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును శనివారం పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. చాగల్లు మండలం సచివాలయ సిబ్బంది, మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్ పాల్గొన్నారు.

కాలి నడకన వెంకన్న సన్నిధికి



నల్లజర్ల, జూన్ 15: టీడీపీ అధికారంలోకి రావాలని మండలంలోని మారెళ్లమూడికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ద్వారకా తిరుమల వెంకన్న స్వామికి మొక్కుకున్నారు. శనివారం మొక్కు చెల్లించేందుకు మారెళ్లమూడి నుంచి ద్వారకాతిరుమల కాలినడనక వెళ్లారు. ప్రగడ శ్రీను, వీరమళ్ళ అజేయ్, ప్రగడ చిన్ని, సత్య ప్రభాకరావు, చంద్రరావు, రామారాజు ఉన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవ మనుగడ

రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కార్యదర్శి కృష్ణమూర్తి



దివాన్‌చెరువు, జూన్ 15: మానవాళి మనుగడకు జీవ వైవిధ్య పరిరక్షణ ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కార్యదర్శి బీఏవీ కృష్ణమూర్తి అన్నారు. లాలాచెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణా అకాడమీలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో రెండురోజుల పాటు నిర్వహించిన జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవవైవిధ్యం అందరి సంపద అన్నారు. ఈ జీవవైవిధ్యంను కాపాడుకుంటూ భావితరాలకు దానిని భద్రంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జీవవైవిధ్యం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. సాంప్రదాయ వైద్యాన్ని ప్రపంచానికి తెలియ చెప్పిన ఘనత బారతదేశానికే దక్కుతుందన్నారు. అలాగే జీవవైవిధ్యయాజమాన్యకమిటీలు తక్షణం చేపట్టాల్సి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలోని 14,300 జీవవైవిధ్యయాజమాన్యకమిటీలు ఉన్నాయన్నారు.అన్ని గ్రామపంచాయితీలతో బాటు అర్బన్ ప్రాంతాలలో కుడా ఈకమిటీలు ఉన్నాయని చెప్పారు. జీవవైవిధ్యయాజమాన్యకమిటీల శిక్షణ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈసందర్భంగా జీవవైవిధ్య యాజమాన్యకమిటీలశిక్షణ కరదీపిక ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ,జీవవైవిధ్యమండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు బి.జానకిరామ్, డాక్టర్ చెన్నకేశవనాయక్ , సత్యప్రసాద్, శిక్షణాకార్యక్రమం కోఆర్డినేటర్ వి.శ్రీహరిగోపాల్, ఎసిఎఫ్ ఎన్.వి.శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలి సభ్యకార్యదర్శి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

ఇద్దరు 'నన్నయ' అధ్యాపకులకు పీహెచ్‌డీలు



రామకృష్ణకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జూన్ 15: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగ అధ్యాపకులు సలాది రామకృష్ణకు, పెదపూడి సత్యరాఘవ విద్యాసాగర్‌కు డాక్టరేట్ పట్టాలను వీసీ ఆచార్య కె.పద్మరాజు శనివారం ప్రదానం చేశారు. డైటోపిక్ డైహైడ్రాజైడ్ అండ్ సెలెక్ట్ అమినో యాసిడ్స్‌తో కొన్ని డైవేలెంట్ ట్రాన్సిషన్ మెటల్ అయాన్ల బైనరీ అండ్ టెర్నరీ కాంప్లెక్స్‌ల సొల్యూషన్ ఈక్విలిబ్రియాపై కెమికల్ మోడలింగ్ స్టడీపై ఆచార్య ఎ.సత్యనారాయణ, ఆచార్య పి.శ్యామల మార్గదర్శకంలో రామకృష్ణ పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. అలాగే విద్యాసాగర్ సిల్వర్ నానోపార్టికల్స్ గ్రీన్ సింథసిస్, మాగ్నెటైట్ నానోపార్టికల్స్ అండ్ జింక్ ఆక్సైడ్ నానో పార్టికల్స్ సజల లీఫ్ ఎక్స్‌ట్రాక్షన్‌లను ఉపయోగించడం అలిసిస్, యాంటీ ఆక్సిడెంట్ అండ్ యాంటీ బాక్టీరియల్ అప్లికేషన్స్‌పై ఆచార్య కె.బసవయ్య పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారన్నారు. ఇద్దరు అధ్యాపకులను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ, అధ్యాపకులు బి.జగన్మోహనరెడ్డి, కె.దీప్తి తదితరులు అభినందించారు.

రైతు సమస్యలపై వినతి

కడియం, జూన్ 15: కడియం రైతుల నుంచి ధాన్యం తీసుకుని ఇప్పటికే 52 రోజులు గడుస్తున్నా వారి ఖాతాల్లో సొమ్ములు పడక రైతులు ఇబ్బంది పడుతున్నారని జనసేన, బీజేపీ నాయకులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (ఎకౌంట్స్) టి.వెంకటరమణను కలిసి రైతుల సమస్యలు వివరించారు. రైతులకు తక్షణమే సొమ్ములు చెల్లించాలని కోరారు. దీంతో వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల ఈశ్వరరావు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, గ్రీన్‌లాండ్ బాబి, కందుకూరి సుబ్రహణ్యం, దంగేటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాన దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 15: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు విభాగాలు, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎం.కాస్మా, కె.వీరలక్ష్మి, పి.విజయలక్ష్మి, వీబీటీ సుందరి, బి.అనూరాధ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాజానగరం, జూన్ 15: రాజానగరంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. బాబాకు నిత్య హారతులతో పాటు పాలాభిషేకం, అఖండ బిల్వార్చన జరిపించారు. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన నాగవరపు రామకృష్ణ దంపతులతో పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---